"తిరుమల క్షేత్రదర్శిని" గ్రంథమాల

# తిరుమల శ్రీవారి
# నిత్య కల్యాణోత్సవం

రచన

**డా॥ నోస్సం నరసింహాచార్య**

ఉపసంపాదకులు

ప్రచురణల విభాగం, తి.తి.దేవస్థానములు

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2015**

# TIRUMALA SRIVARI
# NITHYA KALYANOTSAVAM

**By**
**Dr. Nossam Narasimhacharya**

T.T.D. Religious Publications Series No. 1194
©All Rights Reserved

*First Edition : 2015*

*Copies :* 3000

*Published by :*
**Dr. D. SAMBASIVA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

**"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన,**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి".**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేడు. ఇక మీదకూడ ఉండడు అని అర్థం.


కలియుగ వైకుంఠంగా భాసిల్లే శ్రీవేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొలది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయడూ ఐన శ్రీ వేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 'తిరుమల క్షేత్రదర్శిని' అను పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో, ప్రస్తుతం డా॥ నొస్సం నరసింహాచార్యగారు రచించిన **'తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి నిత్య కల్యాణోత్సవం'** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు అందజేస్తున్నాము. భక్తులీ గ్రంథంద్వారా స్వామివారి అవతార వైభవాన్ని తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.





## తిరుమల శ్రీవారి
# నిత్య కల్యాణోత్సవం

**కృతేతు నారసింహ శ్చ త్రేతాయాం రఘునందనః ।**
**ద్వాపరే వాసుదేవ శ్చ కలౌ వేంకటనాయకః ॥** – అన్నది చతుర్యుగబంధం.

కృతయుగంలో శ్రీ నారసింహస్వామి, త్రేతాయుంలో శ్రీరామచంద్రమూర్తి, ద్వాపరయుగంలో శ్రీకృష్ణ పరమాత్మ, కలియుంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రత్యక్ష దైవాలని వేదాలు పేర్కొంటున్నాయి. శ్రీమహావిష్ణుమూర్తి శ్రీనివాసునిగా అవతరించి అర్చామూర్తిగా నివసిస్తున్న ప్రాంతం తిరుమల. 'తిరు' అంటే పవిత్రమైన అని అర్థం. 'మల' అంటే కొండ. అంటే శుభాన్ని కలిగించే మంగళప్రదమైన, పవిత్రమైన కొండ, తిరుమల. ఇంతటి పవిత్రతకు కారకుడైనవాడు సకల శుభాలకు నిలయమైనవాడు తిరుమల ఆ శ్రీవేంకటేశ్వర స్వామి.

ఈ అఖండ భూమండలంలో అనేకానేక క్షేత్రాలున్నాయి. ఎంద రెందరో వేల్పులున్నారు. ఆ యా దేవతలకు పూజలు, పునస్కారాలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. యాత్రికులు తండోపతండాలుగా ఆ యా క్షేత్రాలను సందర్శిస్తూనే ఉంటారు. అయినా తిరుపతి ప్రాముఖ్యం మాత్రం ఏమాత్రం తగ్గకుండా దినదిన ప్రవర్ధమానమవుతూనే ఉంది. ప్రతి నిత్యం వేలాది భక్తజనులతో నిత్య ధూపదీప నైవేద్యాలతో, ఉత్సవాలతో నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతూంది. ఈ క్షేత్రంలో "అడుగడుగు దండాలవాడా, ఆపదమొక్కులవాడా, అనాథరక్షకా గోవింద గోవింద' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా భక్తుల గోవిందనామాలు వినిపిస్తూనే ఉంటాయి.

**"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥"**

ఈ బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రం లేదు. అలాగే శ్రీ వేంకటేశ్వరస్వామికి సమానమైన దైవం ఇప్పటిదాకా లేదు. ఇకముందు ఉండబోదు అని బ్రహ్మాండాది పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు ప్రశస్తమైన అనేక కారణాలు ఉన్నాయి.

**"వేదములే శిలలై వెలసిన దీ కొండ**
**యే దెస బుణ్యరాశులే యేరులైన దీ కొండ**
**గాదిలి బ్రహ్మాది లోకముల కొనల కొండ**
**శ్రీదేవుడుండేటి శేషాద్రి యీ కొండ"**

అంటూ పదకవితాపితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యులవారు ఈ క్షేత్ర ఆధ్యాత్మిక తేజోవైభవాన్ని తమ సంకీర్తనలలో కీర్తించారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి నివాసం ఏడుకొండలు. అందుకే ఏడుకొండలవాడా! వేంకటరమణా! అని భక్తులు కీర్తిస్తుంటారు. శేషాద్రి, గరుడాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి, అంజనాద్రి, వేంకటాద్రి అనే ఏడుకొండలపైన స్వామివారు వేంచేసి ఉన్నారు. అందుకే స్వామి సప్తగిరీశుడైనాడు. అంతేకాదు స్వామివారికి అత్యంత ఆప్తుడైన ఆదిశేషుని కోరికను మన్నించి శేషుని శిరస్సుపై శ్రీ వేంకటేశ్వరుడు, మధ్యభాగంలో శ్రీ అహోబల నారసింహుడు, పృచ్ఛభాగంలో (తోక) శ్రీశైల మల్లికార్జున స్వామి కొలువై ఉన్నారని పురాణాలు చెబుతున్నాయి.

## శ్రీ వేంకటేశ్వర దివ్య వైభవం

తిరుమల ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం. శ్రీ వేంకటేశ్వరస్వామివారు కలియుగానికి అధిపతిగా (కలౌ వేంకట నాయకః), సమస్త మానవాళికి అభయ ప్రదాతగా, ఆర్తిగా ప్రార్థించే భక్తులందరినీ అనుగ్రహిస్తూ, వేంకటాద్రి శిఖరంమీద కొలువైవున్నాడు. శ్రీవారి దివ్యమైన సన్నిధి అనంత మహిమలతోను, అనేక అమూల్యమైన సంపదలతోను,



అపురూపమైన ఆభరణాలతోను, సమస్త పుణ్యక్షేత్రాలకు తలమానికంగా నిలిచివున్నది. తిరుమల శ్రీనివాసునికి, సంవత్సరం పొడవునా విశేషమైన ఉత్సవాలు జరుగుతూ ఉన్నందువల్ల "ఉత్సవాల దేవుడు" అన్న ప్రసిద్ధిని పొందినాడు.

శ్రీవారి ఆలయంలో అనాది కాలంనుండి, శ్రీ విఖనసమహర్షి ప్రవచించిన శ్రీవైఖానస భగవచ్ఛాస్త్ర నియమానుసారంగా నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవములన్నీ అంగరంగ వైభవంగా జరుపబడుతువున్నవి. ఈ విఖనస మహర్షి సాక్షాత్తు విష్ణ్వంశ సంభూతుడు.

తిరుమలలో శ్రీనివాస భగవానునికి మొట్టమొదటిసారిగా కైంకర్యములు నిర్వహించిన మహనీయుడు శ్రీమాన్ గోపీనాథ దీక్షితుల వారు. శ్రీవారి మూలవిరాట్టు అర్చామూర్తిగా ఉండగా, స్వామి పుష్కరిణి తీరంలో, చింతచెట్టు క్రింది చీమలపుట్టలో, యోగిపుంగవుడు శ్రీవైఖానస అర్చకుడైన శ్రీ దీక్షితుల వారిచే కనుగొనబడి అదే స్థలంలోనే ప్రతిష్ఠించబడింది.

శ్రీ వేదవ్యాస ప్రణీతమైన భవిష్యోత్తర పురాణాంతర్గత శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (4,19-21), ఈ చీమల పుట్ట, చింత చెట్టు, స్వామి పుష్కరిణి మరియు తిరుమల కొండను గురించిన నిగూఢమైన విషయాన్ని అద్భుతంగా వివరించింది.

**వల్మీకం దేవకీ సాక్షాత్ వసుదేవోఽథ తింత్రిణీ।**
**బలభద్రః శేషశైలో మధురాఽభూదధిత్యకా॥**
**స్వామిపుష్కరిణీ తత్ర యమునా చ వ్యరాజత।**
**యాదవా శ్చ మృగాః సర్వే ఖగా వై గోపికాదయః।**
**ఏవం శ్రీకృష్ణరూపేణ క్రీడతే వేంకటాచలే॥**

ద్వాపరయుగంలోని శ్రీ కృష్ణపరమాత్మే తిరిగి తిరుమలకొండమీద శ్రీనివాసునిగా అవతరించాడు. శ్రీకృష్ణపరమాత్మ తల్లి దేవకి చీమలపుట్టగానూ, తండ్రియైన వసుదేవుడు చింతచెట్టుగాను, అవతరించి, శ్రీవారిని పుత్రవాత్సల్యంతోను, అన్నగారైన బలరాముడు (ఆదిశేషుని అవతారం) శేషాద్రి శిఖరరూపంగాను, యమునానది స్వామి పుష్కరిణిగాను మరియు వీటిని ఆవరించియున్న భూమి మధురానగరంగాను వర్ణించబడింది. బాలకృష్ణునితో ఆటలాడిన గోపబాలురు, తిరుమల కొండ మీది మృగాలరూపంలోను మరియు పక్షులన్నీ గోపబాలికలుగా, ద్వాపరయుగం నాటి సంబంధాన్ని ఈనాడుకూడ కొనసాగిస్తున్నట్లుగా పై శ్లోకాల్లో వర్ణింపబడింది.

## శ్రీ వేంకటాచల మాహాత్మ్యం

శ్రీ వేదవ్యాస ప్రణీతమైన మొత్తం 18 పురాణాల్లో కేవలం 12 పురాణాల్లో మాత్రమే శ్రీ వేంకటాచల క్షేత్రమాహాత్మ్యం వర్ణింపబడింది. శ్రీ వేంకటేశ్వరస్వామి పద్మావతీ అమ్మవార్ల పరిణయోత్సవ వృత్తాంతాలు, శ్రీమహావిష్ణువు స్వయంవ్యక్త సాలగ్రామ దివ్య అర్చారూపంలో వేంగడం పర్వతం మీద అవతరించటానికి సంబంధించిన అనేక కథనములు ఈ 12 పురాణాల ద్వార తెలుసుకోవచ్చు. అందుకే దీనికి 'ద్వాదశ పురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యం' అని పేరు. ఇది శ్రీ వేంకటేశ్వరస్వామి అవతరణకు సంబంధించిన స్మృతి ప్రమాణం. ఈ గ్రంథాన్ని భక్తులు నిత్యమూ పారాయణం చేస్తారు. 'అర్చావతారం' అనగా అర్చించటానికి వీలుగా ఉన్న 'విగ్రహ' రూపంలో కొలువైన స్వామివారు అని అర్థం. బ్రహ్మ పురాణం, బ్రహ్మాండ పురాణం(తీర్థకాండ), స్కంద పురాణం, భవిష్యోత్తర పురాణం, ఆదిత్య పురాణం, వరాహ పురాణం, పద్మ పురాణం, (క్షేత్రకాండ), గరుడ పురాణం, మార్కండేయ పురాణం (తీర్థకాండ), వామన పురాణం, బ్రహ్మోత్తర



ఖండం, హరివంశం (శేషధర్మోత్తర కాండ) అనే పన్నెండు పురాణములలో 'శ్రీవేంకటాచల మాహాత్మ్యం' అనేక అధ్యాయాలుగా విస్తరించివున్నది. క్రీ.శ. 1491వ సంవత్సరానికి చెందిన శ్రీవారి ప్రధాన అర్చకస్వామి శ్రీమాన్ శ్రీనివాసమఖి (శ్రీ వేంకటమఖి) గారిచేత స్వయంగా 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం' అను గ్రంథం తాటి ఆకుల పై వ్రాయబడింది. అప్పట్లో (14-15 శతాబ్దం) శ్రీవారి ఆలయంలో ఆ గ్రంథాన్ని దేవతా ప్రీతికై నిత్యమూ పారాయణం చేసేవారు.

## వేదాలు - వేంకటేశ్వరుడు

నాలుగు వేదాలలో మొదటిదైన ఋగ్వేదంలోని ఒక మంత్రంలో (10.155.1), శ్రీవేంకటాచలమును గురించిన ప్రస్తావన వుంది. దీనిని బట్టి, తిరుమల శ్రీవారి యొక్క వైభవము అత్యంత ప్రాచీనమైన, వేదకాలం నాటిదని స్పష్టమవుతున్నది.

**అరాయికాణే వికటే గిరిం గచ్ఛ సదాన్వే**
**శిరిం బిరస్య సత్త్వభి స్తేభిష్ట్వా ఛాతయామసి॥**

"శిరింబిఠుడు అను ఋషి ఈ విధముగా చెప్పుచున్నాడు. ఓ పురుషార్థ కాముకుడా! నీవు ఐశ్వర్య హీనుడైనను, బాహ్యాంతర దృష్టి హీనుడవైనను, లక్ష్మీసంపత్కరమైన శ్రీవేంకటాచలం అనే పేరు గల కొండకు వెళ్ళుము. అచ్చట పరమనిష్ఠాగరిష్ఠులు, వేదమార్గానుయాయులైన శ్రీ వైఖానస అర్చకుల చేత ఆరాధింపబడుచున్న శ్రీ మదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, జగత్ప్రభువైన శ్రీ శ్రీనివాసస్వామి సన్నిధి ఉంది. శ్రీవారి అనుగ్రహం వలన, కొండపై అడుగుమోపిన తత్క్షణమే సమస్త పాపములు దహించుకుని పోయి, శ్రీవారి దర్శనభాగ్యమువలన సకల ఐశ్వర్యములు సిద్ధించును" అని పై మంత్రమునకు అర్థము (శ్రీ శ్రీనివాస దీక్షితులవారి వ్యాఖ్యానం, శ్రీ పారమాత్మికోపనిషత్ భాష్యంనుండి).

## 'వేంకట' పద అర్థం

**వేంకారోఽమృత బీజం తు కటమైశ్వర్య ముచ్యతే ।**
**అమృతైశ్వర్య సంగత్వాత్ వేంకటాద్రి రితి స్మృతః ॥**

**(శ్రీవరాహపురాణం, పూర్వభాగం, 36వ అధ్యాయం)**

'వేం' అనగా పవిత్రమైన అమృతం, 'కట' అనగా అనంతమైన సంపద (ఐశ్వర్యం) అని, 'వేంకట' అంటే అమృతమయమైన, అనంతమైన సంపదలకు నిలయం అని శ్రీ వరాహపురాణం వివరిస్తోంది.

**సర్వపాపాని వేం ప్రాహుః కట స్తద్దాహ ఉచ్యతే ।**
**సర్వపాప దహో యస్మాద్ వేంకటాద్రి రిత్యభూత్ ॥**

**(శ్రీ వేంకటాచలమాహాత్మ్యం)**

'వేం' అనే పదం జీవుడు చేసిన పాపములను సూచిస్తుంది. 'కటః' అంటే సమస్త పాపములను క్షణాలలో దహించివేయగల పర్వతంగా వివరించబడినది. 'వేంకటాద్రి' అంటే సమస్త పాపములను అడుగు మోపిన తత్క్షణమే దహించివేయగల అద్భుతమైన, పవిత్రమైన పర్వతము అని అర్థం.

## పంచబేర ప్రాశస్త్యం - అర్చారూప సౌలభ్యం

ప్రాచీన కాలంలో, మొదటగా శ్రీవారి ఆలయంలో, స్వయంవ్యక్త సాలగ్రామ దివ్య అర్చారూపంలో వేంచేసివున్న, శ్రీ శ్రీనివాస భగవానుడి మూలవర్లకు మాత్రమే పూజలు జరిపేవారు. కనుక మొదట్లో ఇది ఏకబేర ఆలయంగా శ్రీ వైఖానస ఆగమంలో ప్రసిద్ధి చెందినది. 'బేరము' అనగా 'విగ్రహము' అని అర్థం. క్రీ.శ.614వ సంవత్సరంలో, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రంలో చెప్పబడిన విధంగా, కౌతుక బేరంగా, వెండి విగ్రహమైన శ్రీ భోగశ్రీనివాసమూర్తివారి ప్రతిష్ఠ చేయబడింది. అనంతరం క్రీ.శ. 1339



సంవత్సరంలో శ్రీవారి ఉత్సవ బేరమైన శ్రీదేవి-భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి ప్రతిష్ఠ జరిగినది. అంతకుపూర్వం ఉత్సవమూర్తులుగా వుండిన శ్రీదేవి-భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి వారు, ఉగ్ర స్వభావం కారణంగా, నేడు స్నపన బేరంగా పూజలందుకుంటున్నారు. ఇక ఐదవమూర్తి బలిబేరమైన శ్రీ కొలువు శ్రీనివాసమూర్తివారికి ఆరాధనలు జరుగుతున్నాయి. ఈ విధంగా శ్రీవారి ఆలయంలో, శ్రీ వైఖానస శాస్త్రం ప్రకారం విశిష్టమైన 'పంచబేర ఆరాధన' అమలులో ఉంది.

శ్రీ వైఖానస సంహితలలో వివరించిన విధంగా, ఆలయంలో జరిగే వైదిక క్రియలకు ఉపయోగించే హోమగుండాలు ఐదు రకాలుగా చెప్పబడింది. అవి సభ్యం, ఆహవనీయం, అన్వాహార్యం, గార్హపత్యం మరియు అవసథ్యం. వీటినే పంచాగ్నులని కూడా అంటారు. అమూర్త్యారాధన (విగ్రహం లేకుండా) రూపంలో జరిగే వైదిక హోమక్రియలలో ఏ విధంగా పంచాగ్నులున్నాయో, అదేవిధంగా సమూర్త్యారాధన (విగ్రహారాధన) లోని పంచమూర్తులు, ఈ పంచాగ్నులకీ ప్రతీకలు. శ్రీ వైఖానస అత్రి సంహిత సమూర్త్యర్చనాధికరణంలో చెప్పబడిన విధంగా

**పంచానాం స్థాపనం నిత్యం శాంతి పుష్టి సుఖప్రదమ్ ॥**

విష్ణ్వాలయములో పంచబేరములను ఆగమోక్తంగా ప్రతిష్ఠించి నిత్య ఆరాధన చేయడం వలన లోకంలోని ప్రజలందరూ సుఖశాంతులతో, సుభిక్షంగా ఉంటారు. తిరుమల ఆలయంలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి పంచమూర్తులను 'ఆగమ-మంత్ర-వ్యావహారిక' పరిభాషలలో ఈ విధంగా పేర్కొంటారు. 1. 'ధ్రువబేరం-విష్ణువు-మూలవిరాట్', 2. కౌతుకబేరం-పురుష-భోగ శ్రీనివాసమూర్తి, 3. ఉత్సవబేరం-సత్య-మలయప్పస్వామి, 4. స్నపన బేరం-అచ్యుత-ఉగ్ర శ్రీనివాసమూర్తి, 5. బలిబేరం-అనిరుద్ధ-కొలువు శ్రీనివాసమూర్తి. ఈ పంచమూర్తులు

విష్ణువుయొక్క మహారూపములైన విష్ణు-మహావిష్ణు-సదావిష్ణు-వ్యాపినారాయణులను సూచిస్తుంది. పరబ్రహ్మ రూపం 'చతుష్పాత్'గా వర్ణించబడినది. పరబ్రహ్మయొక్క నిగూఢమైన, అద్భుతమైన రూపం నాలుగు గుణాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ మహోన్నత గుణాలతో ఉన్న పరబ్రహ్మ రూపాన్ని భక్తులు ధ్యానం చేయాలి. ఇవి విగ్రహారాధనలో భాగంగా, ముక్తి (మోక్షం) పొందటానికి అతి గొప్ప ఫలితాలనిచ్చే సులభమైన మార్గంగా, శ్రీ వైఖానససంప్రదాయంలో చెప్పబడినది.

ఈ పంచమూర్తులలో ఆదిమూర్తి విష్ణువు. ఈ మూర్తి భేదములే మిగిలిన నాలుగు రూపములు. అవి క్రమంగా విష్ణువు, మహా విష్ణువు, సదా విష్ణువు, వ్యాపి నారాయణ మూర్తులుగా ఉంటారు. విష్ణువు (మూలవిరాట్) అంశమే పురుషుడు (భోగశ్రీనివాసమూర్తి), మహావిష్ణ్వంశమే సత్యస్వరూపుడు (మలయప్పస్వామి), సదా విష్ణ్వంశమే అచ్యుత స్వరూపము (ఉగ్ర శ్రీనివాసుడు), వ్యాపినారాయణాంశమే అనిరుద్ధమూర్తి (కొలువు శ్రీనివాసుడు). వీనికి వరుసగా గుణములు వరుసగా ధర్మ, జ్ఞాన, ఐశ్వర్య, వైరాగ్యములు. విష్ణువుతో గూడిన ఈ ఐదు మూర్తులే పంచవ్యూహములు. ఇదియే పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చా స్వరూపములు. ఐదూ శ్రీ మన్నారాయణుని స్వరూపమును ప్రతిబింబింపజేయును.

'విష్ణ్వర్చనా నవనీతం' అనే వైఖానస సంహిత, పంచబేరముల గురించి ఈ విధంగా తెలియజేస్తోంది.

**ధ్రువం తే గ్రామరక్షార్థ మర్చనార్థం తు కౌతుకమ్ ।**
**స్నానార్థం స్నాపనం ప్రోక్తముత్సవార్థమథౌత్సవమ్ ।**
**బల్యర్థం బలిబేరం చ పంచబేరాన్ ప్రకల్పయేత్ ॥**

ఒక దేహమునకు ఏ విధంగా అయితే పంచప్రాణాలుంటాయో అదే విధంగా ఒక విమానమునకు ఐదు మూర్తులుంటాయని చెప్పబడింది.



ధ్రువబేర ప్రతిష్ఠ సర్వలోకములకు సుఖశాంతి, సమృద్ధిని కలుగజేస్తుంది. సమస్తములైన కామ్యములు పొందుటకు, భక్తులు అర్చకముఖంగా నివేదించే పూజల కొరకు కౌతుకబేరం వుండాలి. ఇక ఆలయంలో వివిధ ఉత్సవాలలో భాగంగా జరిపే స్నపనము (అభిషేకం) కొరకు స్నపనబేరము, ఉత్సవాలను భక్తజనరంజకంగా నిర్వహించడానికి ఉత్సవబేరము, ఆలయంలోని పరివార దేవతలకు నివేదనాదులను పర్యవేక్షించడానికి బలిబేరమును. విధిగా ప్రతిష్ఠించి ఆరాధించవలెను.

శ్రీ వారి గర్భాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి పంచమూర్తులతో పాటు, శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారికి, శ్రీ రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామివారికి, శ్రీసుదర్శనచక్రమునకు, మరియు అనేక సాలగ్రామములకు నిత్యకైంకర్యాలలో భాగంగా పూజలు జరుగుతాయి.

**అర్చారూప సౌలభ్యం**

మానవాళిని మోక్షమార్గంవైపు నడిపించటానికి అతి సులువైన మార్గమే శ్రీమన్నారాయణుని అర్చావతారరూపం. శ్రీమన్నారాయణుడు భక్తులను అనుగ్రహించుటకై పర,వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చారూపములలో కొలువై వుంటాడు.

**వైకుంఠే తు పరే లోకే శ్రియా సార్ధం జగత్పతిః ।**
**ఆస్తే విష్ణురచిన్త్యాత్మా భక్తై ర్భాగవతై స్సహ ॥**

జగత్పతి, తండ్రియైన శ్రీ మన్నారాయణుడు వైకుంఠస్థానమున భక్తులతో, భాగవతులతోసహా, లక్ష్మిని విడువక పరస్వరూపమున విరాజిల్లును. ఇదియే పరమపదము. ఇది అనేక ఆవరణములతోను, అండములతో నిండి వుంటుంది. ఇక్కడ రాత్రింబవళ్ళుండవు. భూమ్యాకాశములు లేవు. చీకటి వెలుగులు, పంచభూతములు లేవు. ఇంద్రియముల కందని ప్రధాన పురుషుడొక్కడే వుంటాడు. జగన్మాతయగు శ్రీదేవి విష్ణువునకు అనపాయినిగా

నిత్యము విడువకయుండును. నిత్యసూరులైన అనంత, గరుడ, విష్వక్సేనులు ఎల్లప్పుడూ పరమపదంలో స్వామిని సేవిస్తూ వుంటారు. ఇక్కడ ఎల్లప్పుడూ స్వామివారికిష్టమైన సామగానమే వినబడును. ఇది భూమినుండి అనంతమైన దూరంలో వుంటుంది కనుక ఇక్కడి నారాయణుని దర్శించటం మానవులకు దుస్సాధ్యమైనది. ఈ స్థూలశరీరంతో పరమపదంలోని స్వామివారిని సేవించడం అత్యంత దుర్లభం.

ముక్తి పొందిన జీవాత్మ సూక్ష్మరూపంలో మాత్రమే ఇక్కడకు చేరి స్వామి వారిని సేవించడానికి వీలవుతుంది.

ఇక రెండవదైన వ్యూహరూపం, క్షీరసాగరం మధ్యలో శేషతల్పంపై శయనించివున్న మహావిష్ణువు, దేవతలకు, ఋషులకు క్షీరాబ్ధినాథుడిగా దర్శనమిస్తాడు. కనుక ఇది కూడా స్థూలశరీరరూపంలో సేవించడానికి దుర్లభమైన రూపం.

మూడవది విభవ అవతార రూపము. ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అని చెప్పినట్లు, ధర్మస్థాపన కోసం దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయుటకై ఆ యా యుగాలలో శ్రీ మన్నారాయణు డవతరించుటయే విభవరూపములు. ఇవి దశావతారములు.

**మత్స్యః కూర్మో వరాహ శ్చ నారసింహో ఽ థ వామనః।**
**రామో రామ శ్చ రామ శ్చ కృష్ణః కల్కీ తి తే దశ॥**

ఇవి అన్నీ గడచిపోయినవి కనుక, ఆ రూపాల్లో భగవానుని దర్శించటం మానవులకు అసాధ్యం. ఇది గత సంవత్సరం నదులలోని నీరు, నది ఎండిన తర్వాత ఏ విధంగా అయితే మన దాహం తీర్చలేనిదో, అదే విధంగా దర్శింప శక్యం కానిది.

నాలుగవది అంతర్యామి స్వరూపం. అంగుష్ఠమాత్ర రూపములో పరమాత్ముడు అందరు జీవుల హృదయము నందు నివసించును.



జఠరాగ్నియగు వైశ్వానరుని రూపమున ప్రాణుల శరీరములో వుండి, ప్రాణాపానాది వాయువులతో కలిసి, మానవులు భుజించే భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యాదులచే నుండు నాలుగురకముల అన్నమును పచనం చేసే తత్త్వమే అంతర్యామిత్వం. ఇది యోగులు మాత్రమే దర్శింపగలరు. జ్ఞాన యోగసాధన చేస్తూ కఠోర దీక్షతో వున్నవారికే అంతర్యామిని దర్శింప శక్యమవును.

ఇక ఐదవది అర్చారూపం, అతి ముఖ్యమైనది. శ్రీమన్నారాయణుణ్ణి, స్థూలశరీరంతో, మాంస చక్షువులతో సులభంగా దర్శించగలిగినది అర్చారూపం. అనేక పుణ్యక్షేత్రములలో స్వయంవ్యక్తం, దివ్యం, సైద్ధం, పౌరాణిక, మానుష విభజనతో అర్చారూపాల్లో, భక్తులందరి పూజలు స్వయంగా స్వీకరిస్తూ, అత్యంత సులభమైన మార్గంలో కోరికలను తీర్చే రూపం ఇది.

## తిరుమల ఆలయం - విఖనస ఆరాధన

తిరుమల శ్రీవారి ఆలయమునకు మరియు శ్రీ వైఖానస భగవదారాధనా విధానమునకు, అత్యంత ప్రాచీనకాలం నుండే అవినాభావ సంబంధం ఉందని అష్టాదశ పురాణాలు మరియు అనేక శ్రుతి ప్రమాణములు తెలియజేస్తున్నాయి. గరుడపురాణంలో శ్రీవారి ఆలయ ఆరాధన విధానమును గురించి ఒక ఆసక్తికరమైన శ్లోకం ఉంది. (ఇదే శ్లోకం శ్రీ వైఖానస భృగు సంహిత, ప్రకీర్ణాధికారంలో కూడా పొందుపరచబడింది). విష్ణ్వంశ సంభూతుడైన భగవాన్ విఖనస మహర్షి శిష్యులైన ఋషులు – అత్రి, భృగు, మరీచి మరియు కశ్యపులు, గురువుగారి ఆదేశం మేరకు అనేక వైఖానస సంహితలను రచించి వాటి ఆధారంగా ఈ భూమండలంలో విష్ణువును ఆరాధించినారు. మరీచి మహర్షి మందర క్షేత్రంలో, అత్రి శ్రీనివాస క్షేత్రంలో, కశ్యపుడు విష్ణుధిష్ఠాన క్షేత్రంలో మరియు భృగుమహర్షి

శుభక్షేత్రంలో, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా శ్రీమహావిష్ణువు యొక్క అర్చారూపాన్ని ఆరాధించారు. పై క్షేత్రములలో మూడు మాత్రం ఏవి అనే ఆధారాలు దొరకలేదు కాని అత్రి ఆరాధించిన శ్రీనివాసక్షేత్రం మాత్రం తిరుమల అని స్పష్టంగా చెప్పవచ్చు.

**పురా చతుర్ముఖాదేశః చత్వారో మునయోమలాః ।**
**ప్రణీయ వైష్ణవం శాస్త్రం భూమావభ్యర్చయన్నృపః ॥**
**మరీచిర్మందరే విష్ణు మర్చయామాస కేశవం ।**
**సర్వదేవోత్తమం దేవం (ఆదేశాత్ బ్రహ్మణో విష్ణుం) శ్రీనివాసే త్రిరర్చయేత్।**
**కశ్యపో విష్ణుధిష్ఠానే శుభక్షేత్రే భృగుర్మునిః ॥**

**– (గరుడపురాణం)**

## భగవాన్ విఖనసమహర్షి

భగవాన్ విఖనసమహర్షి విష్ణుమానసపుత్రుడుగా ఆగమశాస్త్రాల్లో చెప్పబడివుంది. ఆదికాలంలో యజుర్వేద శాఖగా వైఖానస సూత్రాన్ని రచించిన విఖనసుడు స్వయంగా బ్రహ్మ అని మరీచి ఆనందసంహిత తెలియజేస్తోంది. విఖనసమహర్షి వంశీయులే లోకంలో 'వైఖానసులు'గా ప్రసిద్ధి చెందినారు.

విష్ణువే విఖనుడు. ఆయన వంశస్థులు వైఖానసులు. విష్ణు వంశజుడైన విఖనసుడు ఉపదేశించిన సూత్రం, చాల ఉత్తమమైనది. భగవంతుడైన మహావిష్ణువు భూలోకమునందు అర్చావతార రూపంలో అవతరించ దలచినాడు. విష్ణువును ఆరాధించుటకు ఒక సమగ్రమైన ఆరాధన విధానం అవసరమైంది. అందువల్ల మహావిష్ణువు, బ్రహ్మను సృష్టించి, తన ఆరాధనకై ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించమని ఆదేశించినాడు. కాని బ్రహ్మదేవుడు తన అశక్తతను తెలియజేయగా, అప్పుడు శ్రీమహావిష్ణువు తన మనస్సులో సమస్త వేదరాశిమీద దృష్టి నిలిపి ధ్యానించాడు. తత్ఫలితంగా,



భగవాన్ విఖనసమహర్షి విష్ణువు మనస్సు నుండి ఉద్భవించినాడు. సలక్షణంగా, దివ్యమైన తేజస్సుతో విష్ణు చిహ్నాలైన, చతుర్భుజములు, శంఖ, చక్రములతో, అభయ వరద హస్తములతో, ద్వాదశ ఊర్ధ్వపుండ్ర ధారియై, కమండలం మరియు త్రిదండం చేతబూని తులసీ, పద్మమాలలు, కిరీట కర్ణకుండలములతో వెలుగొందుతున్న విఖనసుడు భగవంతునికి నమస్కరించి "ఆజ్ఞాపించమని" అడుగగా, విష్ణువు తన ఆరాధనకై శాస్త్రమును రూపొందించుమని ఆదేశించినాడు. విఖనసుడు వేదరాశి మీద ధ్యానించి మహత్తరమైన శ్రీ వైఖానసకల్పసూత్రాన్ని రూపొందించాడు. ఇదే తర్వాతికాలంలో విఖనసుడి శిష్యాదులచే విస్తరింపబడి, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రం అను పేరుతో ప్రసిద్ధి చెందినది.

## ఆలయ సందర్శనం

కలియుగ వైకుంఠమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ మహాద్వారం నుండి లోపలికి అడుగుపెట్టగానే కృష్ణరాయమండపం, అద్దాల మండపం, రంగనాయక మండపం, బంగారు ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలక శిల, విమాన ప్రదక్షిణంలోని చుట్టుగుళ్ళు, నిత్యకల్యాణోత్సవమండపం, ఘంటా మండపం, బంగారువాకిళ్ళు, జయ విజయులు, స్నపనమండపం, రాములవారి మేడ, శయనమండపం, కులశేఖరపడి దాటగానే స్వామివారు అర్చావతారంలో మూలమూర్తిగా మనకు దర్శనమిస్తారు.

తిరుమలేశుడు తాను నిలుచున్న దివ్యస్థలాన్నిబట్టి, స్వామివారి వక్షఃస్థలంపై కొలువైవున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి పేరునుబట్టి శ్రీ నివాసునిగా పిలువబడుతున్నాడు. అంతేకాదు ఆ శ్రీనివాస ప్రభువు నిలుచున్న తీరుకూడా ఒక మహాద్భుతమే. శ్రీనివాసుని వక్షముపై నివాసమున్న అమ్మవారికి వ్యూహలక్ష్మి అమ్మవారని పేరు. ఈమె నిత్యానపాయని. వక్షఃస్థలంపై వ్యూహలక్ష్మిని దాల్చి, వామ హస్తమును కటియందుంచి, దక్షిణ హస్తమును

తన పాదకమలములవైపు చూపుతూ "సంసారసాగర సముత్తరణైక సేతో..." అన్నట్లుగా కటి వరద హస్తాలతో ఒక సొంపైన భంగిమలో నిలుచుని అందరినీ అలరిస్తూ అనుగ్రహిస్తున్నాడు. అలాగే శ్రీనివాసునికి అలంకరింపబడే దివ్య ఆభరణాలు, వివిధ రకాలైన అపురూప నవరత్న మణిహారాలు, అమూల్య రత్నఖచిత వజ్రవైఢూర్యాలు పొదిగిన కిరీటం ఒకటా! రెండా! కేయూరాలు, కంఠాభరణాలు, నాగాభరణాలు, మకరకుండలాలు, లక్ష్మీహారాలు, వీటన్నిటికీ తోడు వివిధ వర్ణాల పుష్పాలతో అల్లిన పుష్పమాలికలు ఇంకా ఇంకా ఇలా వీటన్నిటినీ చూసేందుకు రెండు కళ్ళు సరిపోవంటే అతిశయోక్తి కాదు.

ఏది ఏమైనా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వరుని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులు కొందరు కాలినడకన కొందరు వాహనాలలో కొందరు బస్సులలో వచ్చి ఎండనక వాననక రాత్రనక పగలనక క్యూలైన్లలో గంటలకు గంటలు నిలబడి కంపార్టుమెంట్లలో వేచి ఉండి ఆలయంలోనికి వచ్చి ఒక్కక్షణం స్వామివారిని దర్శించగానే తాము పడిన శ్రమనంతా మరచిపోయి ఆనందపరవశత్వానికి లోనవుతారు.

శ్రీనివాసుడు అర్చామూర్తిగా నిలిచిన కలియుగ వైకుంఠం తిరుమల గిరికే వరాహక్షేత్రమని కూడా పేరు. శ్రీ భూ వరాహస్వామి ఈ క్షేత్రంలో తొలిదైవం. ఈ క్షేత్రంలో నివసించేందుకు వరాహస్వామి అనుమతిని ఇచ్చిన కారణంగా, తొలి పూజ, తొలి నైవేద్యం, తొలి దర్శనం అన్నీ వరాహస్వామి వారికే జరగాలని వేంకటేశ్వరస్వామి వారు నిర్దేశించినట్లు శ్రీ వేంకటాచల మాహాత్మ్యం చెబుతూంది. అందుకే మొదట వరాహస్వామి వారిని దర్శించిన తరువాతనే శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించాలనేది తిరుమల ఆచారం, సంప్రదాయం. అలా కానట్లైతే వేంకటేశ్వర స్వామివారిని దర్శించిన పుణ్యం కూడా దక్కదు.



భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నపుడు మహాలఘు దర్శనంగా జయవిజయుల దగ్గర నుండే స్వామివారి దర్శనం జరుగుతుంది. భక్తుల సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే, లఘు అంటే జయ విజయులను దాటి రాములవారి మేడవరకు వెళ్ళి స్వామివారిని దర్శించుకునే భాగ్యం కలుగుతుంది.

స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకొని బయటకు రాగానే ఆలయ ప్రదక్షిణలో వకుళామాత, పరివార దేవతలు, బంగారు బావి, స్వామివారి హుండీలో భక్తులు వేసిన కానుకలను లెక్కిస్తూ ఉండే పరకామణి, ప్రక్కనే స్వామివారికి గంధం తీసే గంధపు గది, స్వామివారి వస్త్రాలు భద్రపరిచే సబేర, ముందున్న మండపాలలో వేదపారాయణం చేస్తున్న పండితులు, ఆ ప్రక్కనే నిలబడి చూస్తే ఎదురుగా విమాన వేంకటేశ్వర దర్శనం, భాష్యకారుల సన్నిధి, అన్నమాచార్యుల వారు తమ కీర్తనలను భద్రపరచిన అన్నమయ్య భాండాగారం, ఎదురుగా స్వామివారి హుండి, ప్రక్కనే బంగారు లక్ష్మీదేవి దర్శనమిస్తారు. భాష్యకారుల సన్నిధినుండి కొంచెం ముందుకు రాగానే నరసింహస్వామివారి ఆలయం, ప్రదక్షిణ మార్గంలో పూల అర, పరిమళపు అర కనిపిస్తాయి.

స్వామివారి గర్భాలయ విమానం పేరు ఆనంద నిలయం. అందుకే స్వామి ఆనందనిలయుడు. ఇది శ్రీ వైకుంఠంలో స్వామి వారి క్రీడాపర్వతం. గరుత్మంతుని ద్వారా క్రీడాపర్వతాన్ని వైకుంఠం నుండి తెప్పించి స్థాపింపజేశాడు. ఆ పర్వతంపైన ఆనందనిలయం అనే గర్భాలయంలో శ్రీ స్వామివారు నిలిచివున్నాడు. ఈ బంగారు గోపురంపై విమాన వేంకటేశ్వర స్వామివారు వెండి మకర తోరణంలో కనిపిస్తారు. గర్భాలయ స్వామివారిని దర్శించలేని వారు విమాన వేంకటేశ్వరస్వామిని దర్శించినా కూడా అంతటి పుణ్యం లభిస్తుందని వేంకటాచలమాహాత్మ్యం చెబుతూంది.

## శ్రీ వేంకటేశ్వరస్వామివారి కైంకర్యాలు

శ్రీనివాసుడు నిత్యకల్యాణ చక్రవర్తి నిత్యోత్సవమూర్తి. వేంకటేశ్వర స్వామివారికి ప్రతిరోజు కల్యాణోత్సవం జరుగుతుంది. ప్రతిరోజు ఉదయం నుండి రాత్రివరకు సుప్రభాతం, తోమాలసేవ, సహస్రనామార్చన, డోలోత్సవం, వసంతోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ, ఏకాంతసేవ వంటి నిత్యోత్సవాలతోపాటు, విశేషపూజ, అష్టదళపాద పద్మారాధన, సహస్రకలశాభిషేకం, తిరుప్పావడ సేవ, పూలంగిసేవ, శుక్రవారాభిషేకం వంటి వారోత్సవాలు, రోహిణీ, ఆరుద్ర పునర్వసు, శ్రవణం వంటి నక్షత్రోత్సవాలు, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, ఉగాది ఆస్థానం, పద్మావతీ పరిణయోత్సవం, వసంతోత్సవం, జ్యేష్ఠాభిషేకం, ఆణివారి ఆస్థానం, పవిత్రోత్సవం, సాక్షాత్తు బ్రహ్మదేవుడే నిలిచి జరిపే వార్షిక బ్రహ్మోత్సవం, పుష్పయాగం వంటి సంవత్సరోత్సవాలు ఇలా ఏడాది పొడగునా ప్రతిరోజు ఒక ఉత్సవమే, ప్రతిరోజు ఒక పండుగే. ప్రతిపూట పాయసాలు పరమాన్నాలతో నివేదనలే. లడ్డు, వడ, పులిహోర, దధ్యోదనం, నెయ్యి పొంగలి, చక్కెర పొంగలి, కదంబం, దోసెలు, అప్పాలు, జిలేబీలు, తేనెతొళలు, పోళీలు, ఇలా రకరకాల ప్రసాదాలు స్వామివారికి నివేదించి భక్తులకు సమర్పిస్తుంటారు. ప్రతి పున్నమినాడు స్వామివారికి గరుడవాహన సేవ కనులవిందుగా జరుగుతుంది. ఏడాది పొడగునా శ్రీ వేంకటేశ్వరస్వామివారికి సుమారు 450కి పైగా ఉత్సవాలు నిర్వహించబడుతుంటాయి.

శ్రీవారికి జరిగే నిత్యోత్సవాలలో అత్యంత ప్రశస్తమైనది నిత్యకల్యాణోత్సవం. ప్రతిరోజు సంపంగి ప్రాకారంలోని నిత్యకల్యాణోత్సవ మండపంలో జరిగే ఈ కల్యాణోత్సవంలో వందలాదిమంది గృహస్థులు పాల్గొంటారు. ప్రత్యేక ఉత్సవాలున్న రోజుల్లోతప్ప కల్యాణోత్సవం ప్రతిరోజూ జరిగే సేవనే. అందుకే శ్రీనివాసుడు నిత్యకల్యాణ చక్రవర్తి అయ్యాడు.



## శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం

భగవత్ కల్యాణోత్సవం అన్నటువంటి కార్యక్రమం ప్రధానంగా మన యోగక్షేమాలకు నిర్వహించడం జరుగుతుంది. యోగము అంటే కొత్తగా రావాల్సింది రావడం, అంటే సంతానం లేనివారికి సంతానం కలిగితే అది సంతానయోగం. వాహనం లేనివారు వాహనం కొంటే అది వాహనయోగం. క్షేమము అంటే ఉన్నది అలానే ఉండుట. సాధారణంగా లోకంలో అందరు ఏది ఉండదో అది రావాలని కోరుకుంటారు. ఉన్నవి అలానే ఉండాలని కోరుకుంటారు. ఆ యోగక్షేమాలు రెండూ కూడా భగవత్ కల్యాణం జరిగితే సిద్ధిస్తాయి.

### కల్యాణమంటే?

'కల్యాణం' అనే పదానికి ఒక్కసారి అర్థాన్ని పరిశీలిస్తే 'కల్యం సుఖం అణయతి ప్రాపయతి – ఇతి కల్యాణం – సుఖాన్ని కలిగించేదే కల్యాణం అని సామాన్యార్థం. ఈ కల్యాణాన్నే వివాహం, ఉద్వాహం, పరిణయం, పాణిగ్రహణం మొదలైన అనేక పేర్లతో వ్యవహరిస్తారు. జానపదులు తెలుగులో పెళ్లి, పెండ్లి అనీ, కన్నడంలో 'లగ్న', 'మదువె' అనీ, తమిళంలో 'తిరుమణం' అని పిలుస్తారు.

నిజానికి పద్మావతి శ్రీనివాసుల కల్యాణం 5 వేల సంవత్సరాలకు పూర్వమే జరిగింది. మనం చేసే కల్యాణమేమీ ఆయనకు అక్కరలేదు. అయితే మనం మన యోగక్షేమాలను కోరి ఆ ఏడుకొండలవానికి కల్యాణోత్సవాన్ని జరుపుతున్నాము. తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి వారికి ప్రతిరోజు అభిజిత్‌లగ్నంలో జరిగే ఈ కల్యాణోత్సవ కార్యక్రమానికి వందలసంఖ్యలో గృహస్థులు హాజరవుతారు.

## శ్రీనివాస కల్యాణం పౌరాణిక నేపథ్యం

పూర్వం ఒకసారి మహర్షులకు 'మోక్షం ప్రసాదించే దేవుడు ఎవరు?' అన్న సందేహం కలిగింది. ఋషుల కోరిక మేరకు భృగుమహర్షి త్రిలోకాలను సంచరించి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను పరీక్షించాడు. చివరకు విష్ణువే మోక్షప్రదాత అని నిర్ణయించాడు. ఈ పరీక్షాక్రమంలోనే శ్రీమహావిష్ణువు వక్షఃస్థలాన్ని తన్నిన భృగువుపట్ల కోపించిన లక్ష్మీదేవి వైకుంఠాన్ని వీడి భూలోకానికి వెళ్ళిపోయింది. ఆమెను అన్వేషిస్తూ వచ్చిన నారాయణుడు శ్రీనివాసునిగా నాటకీయంగా వకుళమాలికను ఆశ్రయించాడు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుని కల్యాణాన్ని దర్శించే భాగ్యానికి నోచుకోలేక ఆ ముచ్చటను కలియుగంలో తీర్చుకొనేందుకు జన్మించిన యశోదాదేవే వకుళమాలిక.

నారాయణవరంలో ఆకాశరాజు సంతానలేమిచే సంతానార్థం యాగాన్ని సంకల్పించి భూమిని శుద్ధి చేస్తూ నాగలితో దున్నుతుండగా ఆ నాగేటిచాలులో ఒక స్వర్ణపేటిక లభిస్తుంది. అందులో వికసిత పద్మంపై చిన్న శిశువుగా మహాలక్ష్మి ఆవిర్భవిస్తుంది. ఆమెయే పద్మావతి.

పద్మావతీదేవి పెరిగి పెద్దదై యుక్తవయసును సమీపించి తన చెలికత్తెలతో క్రీడావనంలో క్రీడిస్తుండగా అనూహ్యంగా ఒక మత్తగజం వారిని వెంబడిస్తుంది. ఇదే సమయానికి వకుళమాలిక ఆశ్రమంలో ఉన్న శ్రీ వైకుంఠవిరక్తుడైన శ్రీమన్నారాయణుడు 'శ్రీనివాస' నామధేయంతో పద్మావతిని సమీపించి మత్తగజాన్ని పారద్రోలుతాడు. ఆ సందర్భంలో పద్మావతి శ్రీనివాసులు ఒకరి సౌందర్యాన్ని ఒకరు చూసుకొని మురిసిపోతారు. శ్రీనివాసుడు పద్మావతిని వివరాలు అడుగగా చెలికత్తెలు శ్రీనివాసునిపైన అతని అశ్వంపైన రాళ్ళు రువ్వుతారు. శ్రీనివాసుని తదేకంగా చూస్తూ నిలుచున్న పద్మావతిని చెలికత్తెలు అంతఃపురానికి తీసుకువెళ్తారు.



నాటినుండి ఇరువురు విపరీతమైన విరహవేదనకు లోనౌతారు. పద్మావతి తల్లి ధరణీదేవికి విషయం తెలిసి పద్మావతిని మందలిస్తుంది.

ఇటువైపు శ్రీనివాసుడు వకుళాదేవికి విషయం చెప్పి ఆకాశరాజు ధరణీదేవిల కుమార్తె అయిన పద్మావతితో తన వివాహ విషయాన్ని మాట్లాడి రమ్మని ఒప్పించి పంపిస్తాడు.

ఈ కార్యాన్ని వకుళమాలిక నిర్వర్తించగలదో... లేదో... అన్న సంశయంతో తానే ఒక సోదెకత్తె రూపాన్ని ధరించి ధరణీదేవి అంతఃపుర సమీపంలో సోదె చెప్తున్నట్లు నటిస్తూండగా ధరణీదేవి చెలికత్తెలు వచ్చి పద్మావతి అనారోగ్య స్థితిని వివరించి అసలు జరిగిన విషయమేమిటో చెప్పమని ధరణీదేవి వద్దకు తీసుకువెళ్తారు.

ధరణీదేవి పద్మావతిని చూపి ఈమె అనారోగ్యానికి కారణమేమని అడుగగా 'ఈమె శ్రీనివాసునిపై మనసుపడింది. అతనికిచ్చి వివాహం జరపకపోతే నీ బిడ్డ నీకు దక్కదు. ఈ పెళ్ళి విషయమై మాట్లాడేందుకు త్వరలోనే ఆతని తల్లి వస్తుంది' అని చెప్పి అక్కడినుండి ఉపక్రమిస్తాడు.

ఆ తరువాత వకుళమాలిక ధరణీదేవి ఆకాశరాజులతో పద్మావతి శ్రీనివాసుల వివాహ విషయం ప్రస్తావించగా వారు సమ్మతిని తెలుపుతారు. వకుళమాలిక ఆశ్రమానికి తిరిగివచ్చి శ్రీనివాసునికి శుభవార్తను వినిపిస్తుంది. అయితే మహారాజుతో సంబంధం కాబట్టి వివాహానికి కావలసిన ధనం విషయం వకుళమాలిక ప్రస్తావిస్తుంది. శ్రీనివాసుడు అలకాపురాధీశుడైన కుబేరుని కోరగా అతడు వివాహానికి కావలసిన ధనాన్ని సమర్పించుకుంటాడు. కలియుగం కావడంతో ఆ ధనానికి పత్రం రాసివ్వమనగా శ్రీనివాసుడు కుబేరునికి పత్రాన్ని రాసిస్తూ వేంకటాచలంపై వెలిసే తనకు భక్తులు కానుకలుగా చెల్లించే ధనాన్ని కలియుగాంతం వరకు వడ్డీగా చెల్లిస్తానని తెలియజేస్తాడు.

దేవగురువైన బృహస్పత్యాచార్యులవారు

**"శ్రుత్వాబ్రవీత్స ధిషణస్తయోరుత్తర ఫల్గునీ**
**సమ్మతాస్సుఖ వృద్ధ్యర్థం ప్రోచ్యతే దైవచింతకైః ।**
**తయోరుత్తర ఫల్గున్యాం వివాహః క్రియతామితి**
**వైశాఖమాసే విధివత్ క్రియతామితి సోబ్రవీత్॥"**

అంటూ వైశాఖమాస ఉత్తరఫల్గుణీ నక్షత్ర శుభముహూర్తాన్ని పద్మావతీ శ్రీనివాసుల అభివృద్ధికారకమైన పరిణయ ముహూర్తంగా నిశ్చయిస్తారు.

బృహస్పత్యాచార్యులవారు నిర్ణయించిన శుభముహూర్త విషయాన్ని సకల దేవతలకు తెల్పి వివాహానికి విచ్చేయవలసినదని శ్రీనివాసుడు గరుత్మంతుని ద్వారా ఆహ్వానాన్ని పంపిస్తాడు.

బ్రహ్మరుద్రాది సకలదేవతా పరివార సమేతంగా శ్రీనివాసుడు ఆకాశరాజు ఏర్పాటు చేసిన వివాహ వేదికైన నారాయణవరానికి పయనమవగా, సకల మంత్రి పురోహిత దండనాయక సపరివార సమేతంగా ఆకాశరాజు ఎదురేగి పెండ్లి కుమారుడైన శ్రీనివాసునికి స్వాగతం పలికాడు.

పెండ్లి పీటలపై పద్మావతి శ్రీనివాసులు ఆసీనులు కాగా దేవగురువు బృహస్పతి సకలమునిగణ సమేతంగా వేదమంత్రాలను వల్లించారు. సాక్షాత్ శ్రీమన్ నారాయణ స్వరూపుడైన శ్రీనివాసునికి సాక్షాత్ శ్రీమహాలక్ష్మి స్వరూపిణి అయిన పద్మావతిని ఆకాశరాజు ధరణీదేవిలు కన్యాదానం చేశారు. సకలలోకాలు ఆనంద హర్షాతిరేకాలు తెలుపగా సకల దేవగణం సాక్షిగా శ్రీనివాసుడు జగన్మాత అయిన పద్మావతి దేవికి మాంగల్యధారణ చేశాడు.

ఇది అష్టాదశ పురాణాంతర్గతమైన పద్మావతి శ్రీనివాస కల్యాణం.

## శ్రీనివాస కల్యాణం - చారిత్రక నేపథ్యం

శ్రీ వేంకటేశ్వరుని పరమ భక్తురాలైన తరిగొండ వెంగమాంబ పద్మావతి శ్రీనివాసుల వివాహ ముహూర్తాన్ని "సురుచిర వైశాఖ శుక్లదశమి



శుక్రవారమునాడు శుభముహూర్తంబు" అని తన వేంకటాచల మాహాత్మ్యంలో పేర్కొన్నది.

దాదాపు ఐదువేల సంవత్సరాలక్రితం కలియుగారంభంలో జరిగిన పద్మావతీశ్రీనివాసుల కల్యాణోత్సవ కార్యక్రమాన్ని క్రీ.శ. 15వ శతాబ్దం వరకు తిరుమలలో విశేష దినాలలో, బ్రహ్మోత్సవాలలో మాత్రమే జరిపేవారు.

నందకాంశ సంభూతుడు, పదకవితాపితామహుడు శ్రీనివాసుని పరమభక్తుడైన తాళ్ళపాక అన్నమాచార్యులు తిరుమలకు వచ్చాక స్వామివారికి కల్యాణోత్సవాన్ని ప్రారంభించడమే కాకుండా స్వయంగా తనే కన్యాదాతగా వ్యవహరించేవాడు. అయితే వేంకటేశ్వర స్వామివారిది భారద్వాజస గోత్రం – అన్నమాచార్యులవారిది కూడా భారద్వాజస గోత్రమే. ఏకగోత్రమే అయినా అమ్మవారిపక్షాన పెండ్లి పెద్దగా ఆకాశరాజు స్థానంలో ఉండి శ్రీనివాసునికి కన్యాదానం చేయడం తనకు భగవంతుడిచ్చిన మహద్భాగ్యంగా భావించేవారు. ఆనందనిలయుడు నిత్య పెండ్లికొడుకు కాగా అన్నమాచార్యులవారు నిత్యకన్యాదాత. ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ నేటికీ తిరుమలలో జరిగే శ్రీనివాసుని నిత్యకల్యాణోత్సవంలో అన్నమాచార్యుల వంశీకులే కన్యాదాతలుగా వ్యవహరిస్తూ ప్రముఖ పాత్ర వహిస్తున్నారు.

జగత్కల్యాణ చక్రవర్తి అయిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిత్యకల్యాణం నేటికీ నిర్విఘ్నంగా కొనసాగుతూ తద్వారా శ్రీనివాస మహాప్రభువుల సంపూర్ణ కృపాకటాక్షాలను పొందడానికి అత్యంత శుభప్రదమైన, విశిష్టసేవగా యావత్ ప్రపంచంలోని భక్తలోకంలో గుర్తింపు పొందింది. అన్నమాచార్యుల అనంతరం తాళ్ళపాక వంశీయులు శ్రీనివాస కల్యాణ నిమిత్తం అనేక గ్రామాలు, అగ్రహారాలు యినాములుగా సమర్పించుకున్నట్లు శాసనాల ద్వారా తెలుస్తున్నాయి.

## తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాల చరిత్ర ఎలా మొదలైంది

తాళ్ళపాక అన్నమాచార్యుల వారి కొడుకు (పుత్రుడు) పెద్దతిరుమలాచార్య. ఆయన కొడుకు పేరు తిరువేంకటనాథన్. ఇతన్నే చిన్నన్న అనికూడా అంటారు. తేది 17-07-1546 నాటినుండి చిన్నన్న తిరుమలలో శ్రీవారి కళ్యాణోత్సవాలను ప్రారంభించారు. కొండవీటి సిరామయి ప్రాంతానికి చెందిన మల్లవరం పల్లె నుంచి వచ్చే 120 వరహాలను (శ్రీహరి కళ్యాణోత్సవానికి అయ్యే ఖర్చు) శ్రీవారి ఖజానాకు చేరునట్టు ఏర్పాటు చేశారు. కళ్యాణోత్సవం మొదటిసారిగా ప్రారంభమయినప్పుడు, ఐదురోజులు మాత్రమే నిర్వహించబడుతుండేది. ఈ ఐదు రోజుల్లో దేవుళ్ళకు ప్రత్యేక నైవేద్యాలు, నివేదించబడుతుండేవి. ఈ ఉత్సవాలు గొప్ప ధార్మిక పద్ధతిలో నిర్వహించేవారు.

పన్గుణి మాసము (చంద్రమానములోని ఫల్గుణమాసం) అనురాధ నక్షత్రముతో ప్రారంభమయి ఉత్తరాషాఢ నక్షత్రముతో ముగుస్తుంది. తాళ్ళపాక వంశస్థులు, శ్రీనివాసుణ్ణి వారి అల్లుడిగా, పద్మావతిని వారి కుమార్తెగా భావించి, 1546 సంవత్సరములో ఈ కళ్యాణోత్సవమును ప్రారంభించారు.

తాళ్ళపాక అన్నమాచార్య మనవడు, తాళ్ళపాక చిన్న తిరుమలాచార్యులు (శాసనం సం. 354-97) తిరుమలలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో తేది 17-08-1547 నాడు కళ్యాణోత్సవ సేవను నూతనంగా ప్రవేశపెట్టినప్పుడు, దీనిని చిత్తిరై మరియు తై మాసములలో 5 రోజులు జరగనున్నట్లు ఏర్పాటు చేశారు. ఐదవరోజు రోహిణి నక్షత్రము వచ్చు మాదిరి, ముందు నాలుగురోజులు వైభవంగా కళ్యాణోత్సవము జరిపేవారు. ప్రతిరోజు నివేదనకు ఏ పదార్థాలు పెట్టాలి మరియు ప్రధాన అర్చకులకు, జీయంగార్లకు ఎంత దక్షిణ సమర్పించాలి అను వివరాలను ఈ శాసనంలో వివరించబడ్డాయి. ఈ ఉత్సవము తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని శ్రీలక్ష్మీదేవి మంటపం (పుండరీక వళ్ళి తాయారు సన్నిధి)లో జరపబడుతుంది.



తాళ్ళపాక పరివారం వారు ప్రారంభించిన ఈ ఉత్సవాల్లో, బహుమానంగా తమలపాకులు మరియు వక్కలతో కూడిన తాంబూలము మాత్రమే ఇచ్చేవారు. ఈ వివాహమహోత్సవానికి 250 వరాహాలు ఖర్చు పెట్టేవారు. నెడియా గ్రామం నుంచి వచ్చు ఆదాయంలో 150 వరహాలు కళ్యాణోత్సవ ఖర్చులకుగాను, ఆలయ ఖజానాలో జమ చేయబడేది. ఈ పద్ధతిని తాళ్ళపాక చిన్నతిరుమలయ్యంగారు ప్రవేశపెట్టారు. ఈ ఉత్సవము ఏటా, 5 రోజులపాటు తిరుమల మరియు తిరుపతిలో క్రమం తప్పకుండా నిర్వహించేవారు. తుప్పిలి అగ్రహారం నుండి వచ్చే ఆదాయం, మరియు నగరి సిరిమాయి ప్రాంతానికి చెందిన అంబత్తూరు నుంచి వచ్చే 400 రేఖై నాణాలను కూడా ఈ ఉత్సవాలకు ఉపయోగించబడేవి. ఈ ఆదాయం కేవలం గోవిందరాజస్వామి కళ్యాణోత్సవానికి మాత్రమే కాదు, తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కైంకర్యాలకు కూడా ఖర్చు పెట్టేవారు.

కళ్యాణోత్సవం సమయంలో నాలుగు మాఢవీధుల్లో గొప్ప ఊరేగింపులు, దేవతలకు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించబడేవి. ఆ కళ్యాణోత్సవంలో, మలయప్ప స్వామివారు పెండ్లికొడుకు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు పెళ్ళికూతుళ్ళు. ఈ సమయంలో, ఈ ప్రాంతంలో పండుగ వాతావరణం మరియు అంగ రంగ వైభవం వెల్లివిరిసేవి.

ఈ ఉత్సవంలో పాల్గొనే ప్రధానార్చకులకు, జీయంగార్లకు, ఏకాంగి వేదపారాయణదార్లకు, మిగతా కైంకర్యదారులకు దక్షిణ మరియు ఇతర మర్యాదలు అందించేవారు. కాలక్రమేణ 150 రేఖై నాణాలు ఈ ఉత్సవ నిర్వహణకు చాలకుండాపోయింది. కొండవీడు రాజ్యానికి చెందిన వినుకొండ సిరిమాయి ప్రాంతం ఆదాయాన్ని అనుభవిస్తున్న పెద్దతిరుమలాచార్య కుమారుడు తిరువేదయ్యన్ (తిరు వేంగళనాథన్), తన ఆదాయాన్ని ఉత్సవాలకు ఖర్చు పెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఈ లెక్కన సంవత్సరంలో వచ్చే 470 రేఖై నాణాల ఆదాయాన్ని 19-02-1554

సంవత్సరంలో 'శ్రీ భాండాగారము' (ఆలయ ఖజానా)లో జమ చేయబడింది. ఈ డబ్బుని ఉత్సవాలకుగాను ఖర్చు చేయబడేది. మరియు మిగిలిన డబ్బు దేవుళ్ళ నైవేద్యాలకు ఖర్చు చేయబడేది (శాసనం సం. 419–జిటి). తిరువేంగళనాథన్ ద్వారా, 13–01–1558 సమయంలో, శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణోత్సవం మరిన్ని నైవేద్యాలతో నిర్వహింపబడుతుండేవి. ఐదురోజులపాటు జరిగే కళ్యాణోత్సవంలో తిరువేంగళనాథన్ హయాంలో మొదటినాడు సంప్రదాయబద్ధంగా ధ్వజారోహణ కార్యక్రమం మొదలైనది (ధ్వజారోహణం సామాన్యంగా బ్రహ్మోత్సవాల సమయంలో నిర్వహిస్తారు. కాని వైఖానస ఆగమం ప్రకారం, ఇది ఏ ఉత్సవాలలోనైనా నిర్వహించుకునే వెసులుబాటు ఉన్నది).

శ్రీనివాసునికి తిరుమలలో నిత్యం జరిగే సేవలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనే సేవకూడా ఈ నిత్యకల్యాణోత్సవమే. పూటగడవని పేదవారు మొదలు కోట్లకు పడగలెత్తిన కోటీశ్వరుల వరకు అందరూ సమానంగా పాల్గొనే శ్రీనివాసుని నిత్యకల్యాణోత్సవంలో పాల్గొనే భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉంది.

శ్రీవారి ప్రతిరూపమైన మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సహితంగా పాల్గొనే ఈ కల్యాణోత్సవం పూర్వం బంగారు వాకిళ్ళ ముందే జరిగేది. ఆ తరువాత భక్తుల సౌకర్యార్థం విమానప్రదక్షిణ మార్గంలో ఉన్న కల్యాణ మండపంలోనూ, అటుపై కొంతకాలం రంగనాయక మండపంలోనూ జరిగేది. రోజురోజుకు కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరుగుతూండడంతో అక్కడినుండి కూడా వేదికను మార్చి ప్రస్తుతం సంపంగి ప్రదక్షిణంలో దక్షిణ దిక్కున ఉన్న 'శ్రీ వేంకటరమణస్వామి కల్యాణ మండపం' అనే పేరుతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు.



## ఆర్జితసేవగా కళ్యాణోత్సవం

కాలాంతరంలో కళ్యాణోత్సవం ఆర్జితసేవగా మారింది. శ్రీ సి.అన్నారావు గారు కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు, ఈ ఉత్సవ రుసుము 500/– గా ఉండేది. మొదట ఈ ఉత్సవం, భక్తులచే డబ్బులు కట్టబడిన నాళ్ళే జరుపబడేది. అటుపిమ్మట, నిత్య కళ్యాణం – పచ్చతోరణం అను మాటమీద భక్తుల కోరిక మేరకు నిత్యము చేయటం మొదలైనది. వైఖానసాగమం ప్రకారం, విష్ణువుకు నిర్వహించే మూడు ఉత్సవాలలో ఈ కళ్యాణోత్సవము శ్రద్ధోత్సవము లేక కామ్యోత్సవము అని పిలువబడుతుంది. మిగిలిన రెండింటిని కాలోత్సవం మరియు నైమిత్తికోత్సవము అని అంటారు. వేంకటేశ్వరస్వామి కటాక్షం పొందిన భక్తులు, టిటిడిద్వారా ఖరారు చేయబడ్డ రుసుము చెల్లించి కళ్యాణోత్సవం చేయిస్తామని ప్రతిజ్ఞ చేస్తారు. ప్రస్తుతం రూ.1000/–లు చెల్లించి శ్రీవారి నిత్య కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్థను అనగా భార్యాభర్తలు ఇద్దరిని మాత్రమే అనుమతిస్తారు. వీరికి కల్యాణోత్సవ అనంతరం 1 పైపంచ, 1 జాకెట్టు, 2 పెద్ద లడ్లు, 2 వడలు, 5 చిన్న లడ్లు ప్రసాదంగా ఇస్తారు.

## శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి నిత్యకల్యాణోత్సవం

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్రతిరూపమైన ఉత్సవమూర్తి శ్రీ మలయప్ప స్వామి వారికి, శ్రీ దేవి, భూదేవి అమ్మవార్లకు నిర్వహించే కల్యాణోత్సవం 12 గం॥లకు అభిజిత్ లగ్నంలో ప్రారంభమై 1.30 గం॥ల వరకు కొనసాగుతుంది. శ్రీవారి గర్భాలయంలో మాధ్యాహ్నికారాధన (రెండవ గంట) కాగానే స్వామివారిని అమ్మవార్లను ఏకాంతంగా కల్యాణ మంటపానికి వేంచేయింపజేస్తారు. స్వామివారిని ప్రత్యేకంగా ఒక సింహాసనంపైన, అమ్మవారిని స్వామివారికి కుడివైపున

మరో సింహాసనంపైన వేంచేయిస్తారు. కల్యాణోత్సవ సేవాకర్తలను సుపథంగుండా 10.30 గం॥లకి కల్యాణ మండపానికి అనుమతిస్తారు. సేవాకర్తలు రాగానే వైఖానస అర్చకులు సేవాకర్తలైన దంపతుల నామగోత్రాలతో సంకల్పం చేయిస్తారు. ఆ తరువాత వారిని ఆలయ రెండవ ప్రాకారంలోని కల్యాణమండపంలోనికి అనుమతించి ఒక వరుసక్రమంలో కూర్చోబెడతారు.

కల్యాణోత్సవం యోగక్షేమముల కొరకు నిర్వహింపబడుతుంది. యోగము అంటే కొత్తగా రావలసినవి రావటం. ఇక క్షేమం అంటే ఉన్నది. లోకంలో అందరూ కొత్తగా రావలసినవి రావాలని, ఇప్పటిదాకా ఉన్నవి అలాగే ఉండాలని కోరుకుంటారు. ఈ యోగక్షేమాలు రెండు కూడా దేవతల కల్యాణోత్సవం జరిగితే కలుగుతాయి. అంత గొప్ప కల్యాణోత్సవం ప్రారంభమవుతుంది. ఈ కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో చూచినా, మాట్లాడకుండా దర్శించినా అందరికీ భయం తీరి కోరిన కోరికలు నెరవేరుతాయి. అందుకే పోతన భాగవతంలో

**"అనగ ఆదిలక్ష్మియైన క్రీడసల్పుచున్న రుక్మిణిచూచి..."**

కనుక స్వామివారి కల్యాణం జరిగితే అది లోకకల్యాణమవుతుంది.

కల్యాణోత్సవాన్ని నిర్వహించే వైఖానస అర్చకులు పసుపు వస్త్రాలను ధరించి 'వోచి' కొరకు ఎదురుచూస్తారు. చేత కాగడా ధరించి అర్చకులను ఎవరూ తాకకుండా సంరక్షిస్తూ కల్యాణమండపానికి చేర్చే వ్యక్తి వోచి. వోచి రాగానే కల్యాణోత్సవ కైంకర్య అర్చకులు మరియు బృహస్పతి (కల్యాణోత్సవ సమయంలో మంత్రోచ్చారణ చేసూ్త కైంకర్యాన్ని నిర్వహింపజేసే వేదపండితుడు. వీరినే వాద్యర్ అంటారు.) వోచి ముందు నడవగా అతనివెంట ఆలయ ప్రాకారంలోని కల్యాణమండపంలోనికి ప్రవేశిస్తారు.



కైంకర్యార్చకులు, బృహస్పతి రాగానే తక్కిన అర్చకులు సేవాకర్తల సంకల్పాన్ని పూర్తి చేస్తారు. తరువాత కైంకర్యార్చకులు మలయప్ప స్వామివారికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పాదసేవను నిర్వహిస్తారు. వేదపండితుడు కల్యాణోత్సవానికి అవసరమైన పవిత్రం, కూర్చలు, ఇతర సామాగ్రిని సిద్ధం చేసుకుంటారు. సరిగ్గా 12 గం॥లకు కల్యాణోత్సవ కైంకర్యం అభిజిత్ లగ్నంలో ప్రారంభమవుతుంది.

ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణోత్సవాన్ని వైవాహికోత్సవం అనికూడా పిలుస్తారు. అర్చకులు కూర్మాసనంపై తూర్పుముఖంగా ఔపోసనా అగ్నికుండం ముందు కూర్చుంటారు. అర్చకులకు మరోవైపు ఉత్తరముఖంగా వాద్యర్ (వేదపండితుడు) కూర్చుంటారు. అర్చకుడు దర్భలతో చేసిన పవిత్రాన్ని కుడిచేతి ఉంగరపువేలికి ధరిస్తారు. కల్యాణోత్సవం దేవతాప్రార్థన, విఖనస మహర్షి ప్రార్థనలతో ప్రారంభమవుతుంది.

ఆ తరువాత జరిగే క్రియ పుణ్యాహవాచనం. వేదమంత్రోచ్చారణలతో కల్యాణోత్సవ క్రతువులో ఉపయోగించే సభావేదిక మొదలు పాత్రలు, పదార్థాలు మున్నగువాటినన్నిటినీ పవిత్ర జలాలతో శుద్ధి చేస్తారు. పుణ్యాహవాచనంలో భాగంగా కలశపూజను నిర్వహిస్తారు. ఒక కలశంపై కొబ్బరికాయను గంధపుష్పాక్షతాది మంగళద్రవ్యాలను ఉంచి ఆ కలశంలోనికి వరుణాది దేవతలను ఆవాహనం చేస్తారు. ఆ తరువాత త్రయోదశ ఉపచారాలచేత వరుణదేవుని ఆరాధన, తదనంతరం విష్వక్సేనారాధాన జరుగుతుంది. ఆ పవిత్ర కలశజలాన్ని ప్రోక్షణ చేస్తూ కల్యాణోత్సవ వేదిక మొదలుకొని, హోమగుండం, పాత్రలు, పదార్థాలు, పూజాసామాగ్రి వరకు అన్నిటినీ శుద్ధి చేస్తారు. భగవదారాధనకై వినియోగించే పదార్థాలు, పాత్రలు, పూలు వీటితోపాటు కల్యాణోత్సవ క్రతువు నిర్వహించే అర్చకుని మనసు వరకు అన్నీ మాలిన్యం లేకుండా శుద్ధిగా ఉండాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

కల్యాణోత్సవంలో భాగంగా మొట్టమొదటగా విష్వక్సేనారాధనను నిర్వహిస్తారు. విష్వక్సేనుడు శ్రీమహావిష్ణువుయొక్క సైన్యాలకు అధిపతి. శ్రీహరి ధర్మరక్షకుడు, ఆర్తత్రాణపరాయణుడు, భక్తరక్షకుడు. రాక్షసులు ధర్మానికి గ్లాని కలిగించేవారు . లోకకల్యాణం కొరకు ఏది జరిగినా దానికి ఆటంకం కలిగించేందుకు రాక్షసులు అనేక విఘ్నాలను కలిగిస్తారు. అటువంటి విఘ్నాలను తొలగించమంటూ మొట్టమొదటగా అర్చకస్వాములు

**శ్లో॥ విష్వక్సేనం సకల విబుధప్రౌఢ సైన్యాధినాథం**
**ముద్రాచక్రే కరతలయుగే శంఖదండౌదధానమే**
**మేఘశ్యామం సుఫణిమకుటం పీతవస్త్రం శుభాంగం**
**ధ్యాయేద్దేవం విజితదనుజం సూత్రవత్యా సమేతమ్.**

విష్వక్సేనుని ఆరాధిస్తారు. విష్వక్సేనుని ఆరాధించడంవల్ల సకల దేవతాసైన్యము ఈ కార్యక్రమానికి రక్షణగా నిలబడతారు. ఆ తరువాత శాంతి, తుష్టి, పుష్టి, వృద్ధి, అభ్యుదయాలను ఆకాంక్షిస్తూ శుద్ధి కొరకు 'పుణ్యాహవాచనం' నిర్వహిస్తారు. అంటే వేదికపై అలంకరించి ఉంచిన కలశముల లోనికి దేవతలను ఆవాహన చేస్తారు. 'పుణ్యాహం' అంటే ఈ రోజు లేదా ఈ పగలు అత్యంత శ్రేష్ఠమైనది. అంతేకాకుండా ఈ క్రతువుచేత పూజకు వినియోగించే ద్రవ్యాలకుగానీ, ప్రాంతానికి గాని, పుష్పాలకుగానీ శుద్ధిని కలిగిస్తారు. ఇలా స్వామివారి కొరకు వినియోగించే ప్రతి ద్రవ్యానికి శుద్ధిని పాత్రతను కల్పించే వాటికి స్వామివారిని సేవించే యోగ్యతను కల్పించేందుకు ఆ కలశంలోని నీటిలోనికి వరుణాది సకల దేవతలను ఆహ్వానించే ప్రక్రియకే పుణ్యాహవాచనం అని పేరు. పుణ్యాహవాచనం చేస్తే సకల అమంగళాలు తొలగిపోతాయి. పుణ్యాహవాచనం జరిపితే ఆ ప్రాంతంలో సకల శుభాలు కలుగుతాయి. వేదికపైన అర్చక స్వాములు



ఘంటానాదాన్ని చేస్తూ... విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన కార్యక్రమాలను వేదమంత్రోచ్ఛారణలతో నిర్వహిస్తారు.

*"ఏడుకొండలవాడ గోవిందా... గోవిందా..."*

## అంకురారోపణ

పుణ్యాహవాచనానంతరం కల్యాణ కార్యక్రమాలలో భాగంగా అంకురార్పణ నిర్వహిస్తారు. అంకురం అంటే ఒక గింజ ప్రత్యుత్పత్తి జరిగి ఒక మొలకను బహిర్గతం చేయడం. గింజనుండి మొలక రావాలంటే అది భూమిని ఆధారం చేసుకోవాలి. దానికి నీరు తగిలి సూర్యకిరణాలు సోకితే అంకురం భూమినుండి పైకి వస్తుంది. ఈ అంకురం పైకివచ్చి శాఖోపశాఖలుగా విస్తరించి మహావృక్షమై మనకు ఫలితాన్నిస్తుంది.

ఇక్కడ మట్టి పాలికలతో ఔషధుల గింజలను వేసి వాటిలో మంత్రపూరితమైన జలమును కానీ, పాలనుకానీ పోసి వాటిపై మట్టిచేత కప్పుతారు ఆ కప్పేటప్పుడు మృత్తిక అంటే మట్టిని ప్రార్థిస్తారు. యధార్థానికి మనందరం ఉన్నామన్నా ఐశ్వర్యాన్ని అనుభవించామన్నా అదంతా కేవలం భూమి వలననే, అందుకే భూమిని భూదేవి అంటాం. భూదేవికే 'వసుంధర' అని పేరు. వసుంధర అంటే సమస్త ఐశ్వర్యాలకు నెలవైనది. మనం బ్రతకాలంటే అన్నం కావాలి. ఆ అన్నం భూమిలోంచే పుడుతోంది. మనకొక వాహనం కావాలంటే అందుకు కావలసిన లోహం భూమిలోంచే వస్తుంది. అది నడిచేందుకు కావలసిన ఇంధనం భూమిలోంచే వస్తుంది. పుట్టినప్పటి నుండి మరణించే వరకు భూమే ఆధారం చివరకు ఈ భూమిలోనే కలిసిపోతాం. అటువంటి భూమిపైన అశౌచం చేస్తాం. కాలితో తొక్కుతాం. ఇది మహాపాపం. అందుకే భూదేవిని ప్రార్థిస్తారు. అమ్మ వసుంధరా ఈ కార్యక్రమాన్ని సజావుగా కొనసాగించు అందరూ క్షేమంగా ఉండేలా చేయి అని ప్రార్థిస్తారు. అమ్మ పుణ్యానికి ప్రతిరూపమైన నీవు, మేము చేసిన

పాపాలను క్షమించు అని ప్రార్థించాలి. ఈ చేసిన క్రతువువల్ల మొలక శాఖోపశాఖలుగా విస్తరిల్లి ఒక చెట్టువల్ల నీడ వచ్చినట్లు, పళ్ళు కాయలు వచ్చినట్లు మీ కీర్తి తరతరాలు నిలిచి ఉండేలా అనుగ్రహించుగాక అని పరమపవిత్రమైన ఈ కార్యాన్ని ఆచార్యక్రమము సమంత్రకంగా నిర్వహిస్తారు.

సద్యో అంకురార్పణ కార్యక్రమంలో భాగంగా మట్టిలో తయారు చేసిన పాలికలలో (ముంతలు) అష్టదిక్పాలకులతోపాటుగా సోమ (చంద్రుని) కూడా స్తుతించి ఆవాహనం చేసి ధాన్యాన్ని దానిపై మృత్తికనువేసి పూజిస్తారు. ఈ పాలికలలో ఆవాహనం చేసిన దేవతలకు సకల ఉపచారాలను నిర్వహిస్తారు.

నిజానికి ఆగమశాస్త్ర ప్రకారం అంకురార్పణ కార్యక్రమాన్ని కేవలం రాత్రివేళ మాత్రమే నిర్వహించాలి. కానీ కొన్ని విశేష సందర్భాలలో పగటిపూట కూడా నిర్వహించవచ్చునని ఆగమశాస్త్రం చెబుతూంది.

## ప్రతిసరబంధనం

ఈ కార్యక్రమాన్నే కంకణబంధనం, రక్షాబంధనం అనికూడా అంటారు. కల్యాణ కార్యక్రమంలో తరువాత ప్రతిసరబంధన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాధారణంగా ఒక శుభకార్యం తలపెట్టినపుడు ఎటువంటి అశౌచము తగలకూడదని కార్యక్రమం పరిసమాప్తి అయ్యేవరకు యజమానికి రక్షించడం రక్షాబంధనాన్ని కడతారు. మరి పరమాత్మునికి రక్షాబంధనం ఎందుకు అన్న విషయాన్ని జాగ్రత్తగా తెలుసుకోకపోతే కల్యాణం చూడడంవల్ల వచ్చే ఫలితం తగ్గుతుంది. పరమాత్ముడు శ్రీమహావిష్ణువు ఈ లోకాలన్నిటికీ అధినాయకుడు, భూదేవి ఆయన భార్య. ఈ భూమిపై అధర్మం పెచ్చుపెరిగి భూదేవికి భరించరాని దుఃఖం కలిగితే శ్రీహరి వివిధ అవతారాలు ధరించి దుష్టశిక్షణ చేసి ధర్మసంస్థాపన చేస్తాడు. రామాయణంలో సగరులు భూమిని పాడు చేస్తున్నారని దేవతలు బ్రహ్మదేవునితో చెప్పగా బ్రహ్మ "కాపిలం రూపమార్థాయ ధారయత్యవసుందరాం" అంటారు. అంటే



ఇప్పుడు పరమాత్ముడు కపిలరూపంలో ఉన్నాడు. ఆయనే ఇప్పుడు రక్షిస్తాడు అంటాడు. ధర్మానికి ఎప్పుడైతే గ్లాని కలుగుతుందో అప్పుడు పరమాత్ముడు అధర్మాన్ని నశింపజేసి ధర్మాన్ని రక్షిస్తాడు. తద్వారా లోకాన్ని రక్షిస్తాడు. ఎవరైతే స్వామివారిని శరణు వేడుతారో వారినందరినీ స్వామివారు రక్షిస్తారు. అంటే ఈ లోకాన్ని రక్షించమని వేడుకుంటూ జగన్నాథుడైన స్వామివారికి జగన్మాతలైన అమ్మవార్లకు రక్షాబంధన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ రక్షాబంధనాన్ని వీక్షించిన వారిని పరమాత్ముడు సదా రక్షిస్తాడు.

కంకణబంధనంలో భాగంగా పసుపుదారాలతో తయారుచేసిన కంకణాలలో ఆదిశేషుని ఆవాహనం చేసి ఉపచార పూజలను నిర్వహించి గంధ, పుష్ప, తులసీ మున్నగు మంగళ ద్రవ్యాలతో పూజిస్తారు. ఈ సమయంలో స్వస్తిసూక్తాలను బృహస్పతి స్థానంలో ఉన్న వేదపండితులు పఠిస్తారు.

ఆ తరువాత కైంకర్యార్చకులు పెళ్ళి కుమారునిగా ముస్తాబైన శ్రీనివాస ప్రభువులకు ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, నీరాజనం, ప్రణామం వంటి షోడషోపచార పూజలను నిర్వహిస్తారు. అనంతరం శ్రీనివాస ప్రభువుల కుడిచేతికి, అమ్మవార్ల ఎడమచేతులకు ముందుగా పూజించి పెట్టుకున్న కంకణాలను కడతారు. అలాగే కార్యక్రమాన్ని నిర్వహించే కైంకర్యార్చకులు కూడా తమ కుడిచేతికి కంకణం కట్టుకుంటారు.

తదుపరి వేదమంత్రోచ్చారణల నడుమ కైంకార్యార్చకులు, హోమగుండం ముందు కూర్మాసనంపై ఆసీనులై అగ్ని ప్రతిష్ఠాపన, ఆఘరమును వైదిక కర్మానుసారంగా నిర్వహిస్తారు.

## అగ్ని ప్రతిష్ఠాపన

కల్యాణోత్సవ కార్యక్రమంలో తరువాతి అంగం అగ్నిప్రతిష్ఠాపన. ఈ కార్యక్రమాన్ని అగ్నిభట్టారకులు నిర్వహిస్తారు. భట్టారక శబ్దాన్ని చాలా

అరుదుగా ఈ లోకంలో ఉచ్చరిస్తారు. శృంగార భట్టారక, క్రోధ భట్టారక, లలితా భట్టారిక, అగ్నిభట్టారక. 'భట్టారక' శబ్దానికి అర్థం పరమ పూజనీయుడని. నిజానికి ఆయన లేకపోతే పని జరుగదు. అటువంటి వారికి భట్టారక శబ్దాన్ని ప్రయోగిస్తారు. సృష్ట్యారంభంలో పరమాత్ముని ఆదేశం ప్రకారం అగ్ని 3 మహోపకారాలు చేస్తాడు. 1) దేవతలకు హవ్యం పట్టుకెళ్ళడం, అందుకే హవ్యవాహనుడయ్యాడు. 2) పితృదేవతలకు కవ్యం పట్టుకెళడం. 'స్వాహ' అన్న భార్యతోపాటుగా తీసుకెళితే దేవతలకు, 'స్వహ' అనే భార్యతోపాటుగా తీసుకెళితే పితృదేవతలకు తీసుకెళతాడు. మనకు ఇంట్లో వంట బ్రాహ్మణుడై అన్నం వండి పెడతాడు. అందుకే ప్రతి ఇంట వంట బ్రాహ్మణుడు ఆయనే. ఇంతటి మూడు మహోపకారాలు చేస్తాడు కనుకనే అతడు భట్టారకుడైనాడు. ఈ కల్యాణోత్సవంలో అగ్నిహోత్రునివల్ల స్వామి, అమ్మవార్లు సంతోషిస్తారు. కారణం అసలు అగ్నిహోత్రునివల్లనే వేంకటేశ్వర అవతారం వచ్చింది.

ఒకప్పుడు రావణుడు సీతను అపహరించాలనుకుంటే సీతాదేవిని తనవద్ద ఉంచి వేదవతిని మాయాసీతగా రావణుని వెంట పంపాడు అగ్ని. రావణ సంహారానంతరం అశోకవనంలో అనేక యాతనలుపడిన వేదవతిని కూడా భార్యగా స్వీకరించమని రాముని కోరగా రాముడు వేంకటేశ్వరావతారంలో స్వీకరిస్తానన్నాడు. ఆ వేదవతే పద్మావతిగా కలియుగంలో అవతరించి స్వామివారిని వివాహమాడింది. అలా అగ్ని కారణంగా వేంకటేశ్వరావతారం వచ్చింది. అందుకే అగ్ని కనబడితే వేంకటేశ్వరుడు పరమప్రసన్నుడౌతాడు. కనుక అగ్ని ప్రతిష్ఠాపన చేశాక అగ్నికీలలు పైకి రాగానే భక్తులందరూ నమస్కరిస్తారు. అగ్నికి నమస్కరిస్తే శ్రియం, బలం, తేజం, ఆరోగ్యం మొదలైనవి ప్రసాదిస్తాడు.

అర్చకస్వాములు కల్యాణోత్సవంలో భాగంగా అగ్నిదేవుని ఆవాహనం చేసి అగ్ని ప్రతిష్ఠాపన చేసి ప్రధాన హోమాన్ని నిర్వహిస్తారు. యజ్ఞకుండం



చుట్టూ ప్రజాపతి, బ్రహ్మ, ఇంద్ర, సోమ, వరుణ దేవతలను ఆవాహనం చేస్తారు. వేదామంత్రోచ్చారణలతో ప్రధాన హోమాన్ని నిర్వహించిన తదనంతరం స్వామివారి సేవలో తెలిసో తెలియకో జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ప్రాయశ్చిత్త హోమం నిర్వహింపబడుతుంది.

**మధుపర్కనివేదనం :** మధుపర్క పూజ, మధుపర్కం అంటే తేనె, పెరుగు సమపాళ్ళలో కలిపిన పదార్థం. కల్యాణ వేదికపై ఆసీనులైన స్వామివారికి, అమ్మవార్లకు అర్ఘ్యపాద్యాదులను సమర్పించిన తరువాత తేనె, పెరుగు సమపాళ్ళలో కలిపిన ఈ పదార్థాన్ని ఈ క్రింది మంత్రాన్ని పఠిస్తూ సమర్పిస్తారు అర్చకస్వాములు.

**ఓం యన్మధునో మధవ్యం పరమన్నాద్యం వీర్యం**
**తేనాహం మధునో మధవ్యేన**
**పరమేణాన్నాద్యేన వీర్యేణ పరమోన్నాదో**
**మధవ్యోసాని తేజసే త్వా శ్రియైయశసే**
**బలాయాన్నాద్యాయ ప్రాశ్నామి.**

ఈ మధుపర్క సేవనంవల్ల వీర్యవృద్ధి, మంచి తేజస్సు, శ్రియము, యశస్సు, బలము సిద్ధిస్తాయి. మధుపర్కాలకు పెళ్ళిబట్టలు అనికూడా అర్థం. అందుకే ఈ సమయంలో వధూవరులకు నూతన పట్టువస్త్రాలను కూడా సమర్పిస్తారు.

మధుపర్క నివేదనానంతరం స్వామివారికి, అమ్మవార్లకు పాదప్రక్షాళనం నిర్వహిస్తారు. తదుపరి స్వామివారికి అమ్మవారికి నూతన పట్టువస్త్రాలను సమర్పిస్తారు అర్చకస్వాములు. తదుపరి స్వామివారికి (దర్భలతో చేసిన) కూర్చప్రదానం చేస్తారు.

## నూతన వస్త్రసమర్పణం

కల్యాణోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రాయశ్చిత్త హోమానంతరం శ్రీ మలయప్పస్వామివారికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అర్చకులు నూతన పట్టువస్త్రాలను సమర్పిస్తారు. ఆ తరువాత స్వామివారి పాదాలను కడిగి పాదపూజను నిర్వహించి, దర్భలతో చేసిన దండాకారంలో ఉన్న పొడుగాటి కూర్చను సమర్పిస్తారు.

## కన్యాదానం - మహాసంకల్పం

తిరుమలలో ప్రతిరోజు జరిగే స్వామివారి కల్యాణోత్సవం పూర్వం విశేష దినాలలో (పర్వదినాల్లో, బ్రహ్మోత్సవాల్లో) మాత్రమే జరిగేదనీ ఈ కల్యాణోత్సవాన్ని తాళ్ళపాక అన్నమాచార్యులవారు పండుగ, విశేష దినాలతో నిమిత్తం లేకుండా ప్రతిరోజు కల్యాణం జరిగేలా నిత్యకల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. అంతేకాక తానే స్వయంగా స్వామివారికి కన్యాదాత స్థానంలో ఉండి తిరుక్కల్యాణాన్ని నిర్వహించారు. ఈ విధంగా శ్రీనివాస ప్రభువు అన్నమాచార్యులకు అల్లుడైనాడని అన్నమయ్య దౌహిత్రుడు శ్రీ రేవణూరి వేంకటాచార్యులు తన శకుంతలాపరిణయ కావ్యంలో 'అమ్మహదేవుండు మదీయ మాతామహవంశ శిఖారత్నంబగు నన్నమాచార్యునకు జామాతరుండనిపించుకొని' అని అంటాడు. అలాగే తన మరో కావ్యమైన 'శ్రీపాదరేణు ప్రభావం'లో

**"శ్రీలలరంగ మంగమను శ్రీహరికెన్నడు ధారవోయుచో**
**దాళులపాక యన్నమయ దా గడిగెం బదముల్ ధరిత్రి"**

అంటూ అన్నమయ్య శ్రీహరి కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన భాగ్యశాలి అని పేర్కొంటాడు.

ఇక మరో విశేషమేమిటంటే శ్రీవేంకటేశ్వరస్వామివారి గోత్రము, తాళ్ళపాక అన్నమాచార్యులవారి గోత్రం ఒక్కటే. భారద్వాజ గోత్రం.



ధర్మశాస్త్రాల ప్రకారం సగోత్రీకులు రక్తసంబంధీకులు అవుతారు. కనుక సగోత్రీకులకు కన్యాదానం చేయరాదు. అయితే ఇక్కడ కల్యాణం జగత్కల్యాణ చక్రవర్తిది. కన్యాదాత అన్నమాచార్యులు నందకాంశజులు. ఆనంద నిలయుడు, నిత్య పెళ్ళికొడుకు అన్నమాచార్యులు నిత్య కన్యాదాత. అందుకే నేటికీ తిరుమల శ్రీవారి కల్యాణోత్సవంలో అన్నమాచార్యుల పక్షాన వారి వంశీయులు కన్యాదాతలుగా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో భాగంగా వైఖానసార్చకులు మహాసంకల్ప పఠనం చేస్తారు.

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకునికి చేస్తున్న కన్యాదానం కనుక ఆ కన్యాదాన విశేషం, కన్యాదాన ఫలితాలను వివరిస్తూ దేశకాల ఉచ్చారణలతో మహాసంకల్పం కొనసాగుతుంది. ఇందులో భాగంగా సప్తావరణ వర్ణన, చతుర్దశలోక వర్ణన, అష్టదిక్పాలక, పురవర్ణన, భరతఖండ విస్తీర్ణ వర్ణనలతోపాటుగా సంవత్సర, అయన, ఋతు, మాస, పక్ష, తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాది పంచాంగ వర్ణనలు ఉంటాయి. ఆ తదుపరి ప్రధాన ఘట్టమైన కన్యాదానంయొక్క ఫలిత విశేషాలను వివరిస్తూ ఏడేడు జన్మాలలోనూ, బాల్య యౌవన, కౌమార వార్ధక్యాలలోను, రాత్రి, పగలు, తెలిసో తెలియకో చేసిన మహాపాతకాలు నశించడం కొరకు వైకుంఠలోక, సూర్యలోక, బ్రహ్మలోక, ధ్రువలోక, గోలోక నివాస అర్హత కొరకు, శతయాగ పుణ్యఫలం కొరకు, శ్రీ విఖనస మహాముని సిద్ధాంతానుసారం, గృహ్యధర్మ శాస్త్రాలలోకి కన్యాదానకల్పంలో వివరించిన సకలఫల సిద్ధికొరకు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన సాక్షాత్ విష్ణుస్వరూపుడైన శ్రీనివాస ప్రభువునకు సాక్షాత్ మహాలక్ష్మీ స్వరూపమైన అమ్మవార్లను ఇచ్చి కన్యాదానం చేస్తున్నాను అని వివరిస్తూ అన్నమయ్య వంశీకులచే కన్యాదానం చేయించడం మహాసంకల్ప సారాంశం.

## మహాసంకల్పం

"అథ భగవతో మహాపురుషస్య శ్రీమదాదినారాయణస్య, అచింత్యా పరిమితశక్త్యా ధ్రియమాణస్య మహాజలౌఘస్య మధ్యే, పరిభ్రమ మాణానామనేకకోటిబ్రహ్మాండానామేకతమే, అప్తేజోవాయ్వాకాశాహంకార మహదవ్యక్తాఖ్య సప్తావరణైరావృతే, అస్మిన్మహతి బ్రహ్మాండే ఆధారశక్తి శ్రీవరాహ కూర్మానన్తాష్టదిగ్గజో పరిప్రతిష్ఠితానాం, అతలవితల సుతల తలాతల రసాతల మహాతల పాతాలాఖ్య సప్తలోకానా మూర్ధ్వభాగే, భూలోక భువర్లోకసువర్లోక మహర్లోక జనోలోక తపోలోక సత్యలోకాఖ్యా నామధోభాగే మహానాలాయమానస్య, ఫణిరాజస్య శేషస్య సహస్రఫణామణిమండల మండితే, ఐరావత పుండరీక వామనకుముదాంజన పుష్పదంత సార్వభౌమ సుప్రతీకాఖ్యాష్టదిగ్దంతిశుండాదండోత్తంభితే, అమరావతీ తేజోవతీ సంయమినీ రక్షోవతీ సింధుమతీ గంధవత్యలకావతీ యశోవతీత్యష్ట దేవపురీ విరాజితే, ఇంద్రాగ్నియమ నిర్ృతివరుణవాయుకుబేరే శానాఖ్యాష్ట లోక పాలక పరిపాలితే, లోకాలోకాచల వలయితే, లవణేక్షు సురాసర్పిర్దధి క్షీర శుద్ధోదకాఖ్య సప్తార్ణవ పరివృతే, జంబూ ప్లక్షకుశ క్రౌంచశాకశాల్మలి పుష్కరాఖ్యనవద్వీప దీపితే, మహేంద్ర మలయ సహ్యశుక్తిమదృక్షవ ద్వింధ్య పారియాత్రాఖ్య సప్తకుల పర్వత విరాజితే, భారత కింపురుష హరీళావృత భద్రాచలకేతుమాల హిరణ్యకరమణకకురు వర్షాఖ్య నవవర్షాణాం మధ్యే భరత వర్షే, ఇంద్రకశేరు తామ్ర గభస్తి పున్నాగ గంధర్వ సౌమ్యవరుణ భరతాఖ్య నవఖండానాం మధ్యే, భరతఖండే, మహాసరోరుహాకారపంచాశత్కోటియోజనవిస్తీర్ణ భూమండలే, లక్షయోజన విస్తీర్ణ జంబూద్వీపే, దండకారణ్యే, ప్రజాపతిక్షేత్రే, కర్మభూమౌ, అవంతీ కురుక్షేత్రాది సమభూమధ్య రేఖాయాః పూర్వదిగ్భాగే, మేరోర్దక్షిణదిగ్భాగే, శ్రీ వేంకటాచలస్య పూర్వదిగ్భాగే, శ్రీరంగస్యోత్తరదేశే, మహానద్యోర్మధ్యదేశే, సత్యవ్రత క్షేత్రే, సకల దేవతా సన్నిధౌ, సకల జగత్ స్రష్టుః, పరార్ధద్వయ జీవినో బ్రహ్మణో ద్వితీయ పరార్ధే ప్రథమ వర్షే ప్రథమపక్షే



ప్రథమ దివసే, ద్వితీయ యామే, త్రయోదశ ఘటికాద్వి చత్వారింశ ద్విఘటీషు గతాసు తృతీయముహూర్తే ప్రథమ ప్రాణాయామ కాలే, పురుహూత నామధేయేన్ద్ర సమయే, పార్థివ కూర్మ ప్రళయానంత శ్వేత వరాహ బ్రహ్మ సావిత్రాఖ్య సప్తకల్పానాం మధ్యే పంచమే శ్వేతవరాహకల్పే, స్వాయంభువ స్వారోచిషోత్తమ తామస రైవత చాక్షుష వైవస్వత సూర్యసావర్ణి ధర్మసావర్ణి దక్షసావర్ణి రుద్రసావర్ణి బ్రహ్మసావర్ణీంద్రసావర్ణి వేదసావర్ణ్యాఖ్య చతుర్దశ మన్వంతరాణాం మధ్యే సప్తమే వైవస్వత మన్వంతరే, తత్రైక సప్తతి మహాయుగానాం సప్తవింశతి తమే, మహాయుగే అష్టావింశతి సహస్రాన్విత సప్తదశ లక్షాబ్దే కృతయుగే యాతే, షణ్ణవతి సహస్రాన్విత ద్వాదశ లక్షాబ్దే త్రేతాయుగే యాతే, చతుష్షష్టి సహస్రాన్వితాష్ట లక్షాబ్దే ద్వారయుగే యాతే, ద్వాత్రింశత్ సహస్రాన్విత చాతుర్లక్షాబ్దే వర్తమానే కలియుగే, ప్రథమపాదే, యుధిష్ఠిర విక్రమార్క శాలివాహన విజయాభినందన నాగార్జున కల్కి భూపాఖ్య షట్చక్రాణాం మధ్యే, తృతీయశాలివాహనశకే, అస్మిన్దేశే వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన ప్రభవాది షష్టి సంవత్సరాణాం మధ్యే–సంవత్సరే– అయనే – ఋతే – మాసే – పక్షే – తిథౌ – వాసరే – నక్షత్రే – యోగే– కరణే – ముహూర్తే – మమ అనేక జన్మసు ఇహ జన్మనిచ ఏతత్ క్షణ పర్యంతం బాల్య యౌవన కౌమార వార్ధకేషు, రహసి ప్రకాశే చ ఆవృత్తానావృత్త మహాపాతకాది సమస్త దురితక్షయార్థం, దశపూర్వేషాం, దశ పరేషాం, మద్వంశ్యానాం మాతృవంశ్యానాం సర్వేషాం పితృణాం కుంభీపాక లోహిత ధామాతప సంఘాత కాల సూత్రాది వివిధేభ్యో మహాఘోరేభ్యో నరకేభ్యః, ఉత్తీర్యసూర్యమండలపర్యన్తం కృతరాశేర్వర్ష సహస్రావసానే, ఏకైక తిలాపకర్షణ క్రమేణ సర్వరాశ్యపకర్షణసమ్మితకాలే, శ్రీహరి లోక నివాససిద్ధ్యర్థం, యవైశ్చంద్రమండల పర్యంతం, కృతరాశేర్వర్ష సహస్రావ సానే ఏకైక యవాపకర్షణ క్రమేణ సర్వరాశ్యపకర్షణ సమ్మితకాలే, ఆదిత్య లోకే నివాస సిద్ధ్యర్థం, గంగా వాలుకాభి స్సప్తర్షి మండలపర్యంతం

కృతరాశే ర్వర్ష సహస్రావసానే ఏకైక మాషాపకర్షణక్రమేణ సర్వరాశ్యపకర్షణ సమ్మితకాలే బ్రహ్మలోకే నివాస సిద్ధ్యర్థం, మాషైః, ధ్రువమండల పర్యంతం కృతేరాశేః వర్ష సహస్రావసానే ఏకైక మాషాపకర్షణ క్రమేణ సర్వరాశ్యపకర్షణ సమ్మితకాలే ధ్రువలోకే నివాససిద్ధ్యర్థం. గోలోమభిర్నక్షత్ర మండలపర్యంతం కృతరాశేః వర్ష సహస్రావసానే ఏకైక లోమాపకర్షణక్రమేణ సర్వరాశ్యపకర్షణ సమ్మితకాలే గోలోకే నివాససిద్ధ్యర్థం, త్రిగుణీకృతాగ్నిష్టోమాతి రాత్రాప్తోర్యామ సాంతపనవాజపేయ పౌండరీకాశ్వమేధాది శతక్రతు పుణ్యఫలావాప్త్యర్థం, ఆమోద ప్రమోద సమ్మోద వైకుంఠాఖ్య లోకేషు సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్య మితి చతుర్విధ మోక్షఫల సిద్ధ్యర్థం అస్యదేవదేవస్య భగవతో నారాయణస్య పరవ్యూహవిభవాంతర్యామ్యర్చా స్వరూప రూపగుణవిభవైశ్వర్యాది నిరూపక శ్రీ విఖనసమునీంద్ర మతానుసారిభిః ఋగ్వాదిభిః మన్వాదిభిః వసిష్ఠాదిభిః దివ్య మహర్షిభిర్యుక్త గృహ్యధర్మ శాస్త్ర పురాణేతిహాస ప్రతిపాదిత కన్యాదాన కల్పోక్త సకలఫలావాప్త్యర్థం కన్యాదానం కరిష్యే".

ఈ విధంగా మహాసంకల్పం పూర్తి అయిన తరువాత స్వామివారి, ఇరువురు అమ్మవార్ల ప్రవరలను శ్రావ్యంగా పఠిస్తారు అర్చకులు. ప్రవర అంటే పరిచయం. సాధారణంగా ఒక వివాహం జరిపించాలంటే అటు ఏడుతరాలు ఇటు ఏడుతరాలు చూడాలి అంటూ ఉంటారు. అంటే పెళ్ళి కుమారుడియొక్క వంశము, గోత్రము, ఎవరి మునిమనుమడు, ఎవరి మనుమడు, ఎవరి కుమారుడు / కుమార్తె అనే విషయాలను అందరికీ తెలిసేలా పురోహితులు పెండ్లికొడుకు, పెండ్లికుమార్తెల ప్రవరలు చదవడం ఆనవాయితీ. కానీ ఇక్కడ పెండ్లికొడుకు సాక్షాత్తు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు. పెళ్ళికుమార్తెలు సాక్షాత్తు ఆదిలక్ష్మీదేవి. అయినా లోకధర్మాన్ని అనుసరించి స్వామివారికి అమ్మవార్లకు ప్రవరలను అర్చకస్వాములు వినిపిస్తారు.



**స్వామివారి ప్రవర**

చతుస్సాగర పర్యంతం గోబ్రాహ్మణేభ్యః శుభం భవతు.

ఆంగీరస, బార్హస్పత్య, భారద్వాజ త్రయార్షేయ ప్రవరాన్విత భారద్వాజస గోత్రోద్భవాయ, అచింత్యాద్భుత నిత్యయౌవ్వన స్వభావలావణ్య రత్నాకరాయ శ్రీనివాస పరబ్రహ్మణేవరాయ.

**శ్రీదేవి అమ్మవారి ప్రవర**

చతుస్సాగర పర్యంతం గోబ్రాహ్మణేభ్యః శుభం భవతు భార్గవ చ్యవన ఆప్నవాన ఔర్వ వైదల పంచార్షేయ ప్రవరాన్విత భార్గవసగోత్రోద్భవీం మూలప్రకృతిరూపాం, అయోనిజాం, భృగుసంకల్ప తనయాం శ్రీదేవీనామ్నీమిమాం కన్యామ్ వృణీమహీదాస్వారా.

**భూదేవి అమ్మవారి ప్రవర**

చతుస్సాగర పర్యంతం గోబ్రాహ్మణేభ్యః శుభం భవతు
కాశ్యప అవత్సార నైధ్రువ త్రయార్షేయ ప్రవరాన్విత కాశ్యపగోత్రోద్భవీం
విష్ణోః పురాణమహిషీం, ప్రకృత్యంశ సంభూతా కశ్యప ప్రజాపతేః
**సంకల్పతనయాం భూదేవీ నామ్నీ మిమాం కన్యాం**

**"కన్యాం కనక సంపన్నాం**
**కనకాభరణైర్యుతామ్ ।**
**దాస్యామి విష్ణవే తుభ్యం**
**బ్రహ్మలోక జిగీషయా ॥**

**కన్యాం స్వలంకృతాం సాధ్వీం**
**సుశీలాయ సుమేధసే ।**
**ప్రయతోహం ప్రయచ్ఛామి**
**ధర్మకామార్థ సిద్ధయే ॥**

**విశ్వంభరా స్సర్వభూతాః**
**సాక్షిణ స్సర్వ దేవతాః ।**
**ఇమాం కన్యాం ప్రదాస్యామి**
**ప్రీణాతు కమలాపతిః ॥"**

అంటూ అర్చకస్వాములు అన్నమాచార్యుల వంశీకులచేత కన్యాదానం చేయిస్తారు. ఆ తరువాత స్వామివారి పాదాలను శుద్ధజలంతో కడిగి తిరువారాధనం నిర్వహిస్తారు. తదనంతరం మాంగల్యారాధనను నిర్వహిస్తారు. స్వామివారి పాదాల చెంతన ఒక కొబ్బరికాయపై మాంగల్యాలను ఉంచి సకలోపచారాలతో పూజించి వాటిపై పసుపు కుంకుమ గంధ పుష్ప అక్షతలు మున్నగు మంగళద్రవ్యాలతో పూజిస్తారు.

ఆ తరువాత స్వామివారి కరకమలములకు తాకించి భక్తులందరికీ ఆ పవిత్ర మాంగల్యాలను చూపిస్తూ మొదట శ్రీదేవి అమ్మవారికి, ఆ తరువాత భూదేవి అమ్మవారికి అర్చకులు ధరింపజేస్తారు. ఆ తరువాత కర్పూర మంగళ నీరాజనం సమర్పిస్తారు.

ఆ తరువాత అర్చకులు హోమగుండం ముందు కూర్చుని ప్రధానహోమం నిర్వహిస్తారు.

**లాజాహోమం**

ప్రధాన హోమం తరువాత అర్చకులు స్వామివారు, అమ్మవార్ల పక్షాన లాజాహోమాన్ని నిర్వహిస్తారు. 'లాజా' అంటే పేలాలు. నిజానికి పెళ్ళి కుమారుడు పెళ్ళి కుమార్తె చేతిలో పేలాలను నింపి ఆమె చేతులను అలాగే పట్టుకొని హోమగుండం చుట్టూ ప్రదక్షిణం చేసి అగ్నిదేవునికి ఆహుతిని పెళ్ళికుమార్తెచే వేయిస్తాడు. ఇలా మూడుసార్లు పేలాలతో ఆహుతిని సమర్పిస్తారు. పెళ్ళికుమారునికి దీర్ఘాయువు, పెండ్లి కుమార్తెకు దీర్ఘ సౌమంగళ్యం సిద్ధించేందుకు ఈ లాజాహోమాన్ని నిర్వహింపజేస్తారు. లాజాహోమం అయ్యాక పూర్ణాహుతిని సమర్పిస్తారు.



హోమగుండం నుండి రక్షను తీసి (పవిత్ర విభూతి) అర్చకస్వాములు స్వామివారి నుదుటన అమ్మవారి నుదుటను ధరింపజేస్తారు. అలాగే అర్చకుడు కూడా శిరస్సు, నుదురు, కంఠం, హృదయం, బాహువులు, ఉదరం మున్నగు 12 ముఖ్యమైన స్థానాలలో ఈ రక్షను ధరిస్తాడు.

ఆ తరువాత జరిగే మరో ముఖ్యఘటం వారణమాయిరం. ఈ ప్రక్రియ శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఒక విశేష ప్రక్రియ. ఇందులో భాగంగా స్వామివారి వైపునుండి అర్చకులు, అమ్మవారి వైపునుండి కన్యాదాత అయిన తాళ్ళపాక వంశస్థులు ఎదురెదురుగా కూర్చొని ఒక నూతన వస్త్రాన్ని మధ్యలో పరచి రెండు కొబ్బరికాయలను అటు ఇటు ఒకరివైపుకు ఒకరు దొర్లిస్తూ ఉంటారు. ఈ సందర్భంలో గోదాదేవి శ్రీరంగనాథుని లీలలను వర్ణిస్తూ చేసిన (స్తుతి) పాశురాలను ద్రవిడవేదంగా ఆచార్య పురుషులు రాగయుక్తంగా గానం చేస్తారు. ఈ స్తుతినే వారణమాయిరం అంటారు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో వైదిక మంత్రాలతోపాటు దేశీయమైన ద్రవిడ వేదానికి కూడా ప్రాధాన్యం కల్పించబడింది.

**వారణ మాయిరం**

**వారణ మాయిరం శూళవలంశెయ్‌తు**
**నారణ నమ్బి నడక్కిన్రా నెన్టెతిర్**
**పూరణ పొఱ్ఱుడం వైత్తుప్పుఱమెంగుమ్**
**తోరణం నాట్టక్కనా క్కండేన్ తోళి నాన్.**

ఓ సఖీ! నేనిట్లు కల గన్నాను. సమస్తజీవులకు అంతర్యామియైన సౌలభ్యగుణపూర్ణుడైన శ్రీకృష్ణుడు, వెయ్యి వారణములతో (ఏనుగులతో) ప్రదక్షిణముగా ఈ నగరములో నూరేగుచు వస్తున్నాడు. ఆ స్వామి కెదురుగా సువర్ణ పూర్ణకుంభములుంచి తోరణస్తంభములు నాటుచున్నారు.

**నాళై వదువై మణమెన్టు నాళిట్టు**
**పాళైకముగు పరిశుదైప్పన్దర్కీళ్**
**కోళరి మాదవన్ కోవిందనెన్బానోర్**
**కాళై పుకుత క్కనా కండేన్ తోళి నాన్.**

రేపు పెండ్లికి ముహూర్తము పెట్టి మా పెద్దలు పెండ్లి పందిరికి పోకచెట్లు కట్టి అలంకరించగా గోరక్షకుడైన శ్రీకృష్ణుడు అట ప్రవేశించినట్లు నేను కలగన్నాను. ఆ యువకుడు సుందరుడు మాత్రమేగాక సింహ విక్రముడుగూడ నగుట విశేషము.

**ఇన్దిరనుళ్ళిట్ట తేవర్ కుళా మెల్లామ్**
**వన్దిరున్దెన్నై మగళ్పేశి మన్దిరత్తు**
**మన్దిరక్కోడి యుడుత్తి మణమాలై**
**అన్దరి శూట్టక్క నా క్కండేన్ తోళి నాన్.**

ఇంద్రాది దిక్పాలు రందరు శ్రీ మహావిష్ణువుతో నా కల్యాణము చేయింప మా యింటికి వచ్చినారు. మా తండ్రిగారితో కేశవునకు నన్నిచ్చునట్లు ఆలోచనలు చేసినారు. తర్వాత మా ఆడుబిడ్డ దుర్గాదేవి పసుపుబట్టలతో పూలమాలలతో నన్ను అలంకరించినది.

**నైత్రిశైత్తీర్తం కొణర్న్దుననినల్కి**
**పార్పనచ్చిట్టర్కళ్ వల్లారొడుత్తేత్తి**
**పూప్పునై కండిప్పు నిదనోడెన్టన్నై**
**కాప్పు నాణ్కట్ట క్కనా కండేన్ తోళి నాన్.**

బ్రాహ్మణులు చాలమంది దశదిశలనుండి పవిత్రనదీ తీర్థము కొని తెచ్చి పలుమారు మాపై ప్రోక్షించి శ్రావ్యకంఠములతో మంగళాశాసనము పలికారు. తర్వాత వివిధ పుష్పరమ్యమాలికను ధరించిన మాధవునిచే నాకరమున కంకణము కట్టించారు.



**కదిరొళి దీపం కలశముడనేన్ది**
**శదిరిళ మంగైయర్తాం వందెదిర్ కొళ్ళ**
**మదురైయార్ మన్ననడినిలై తొట్టెంగుం**
**అదిర పుగుదక్కనాకండేన్ తోళి నాన్.**

బుద్ధిచతురలును, సుందరలును నగు పుణ్యస్త్రీలు, సూర్యతేజము గల సువర్ణ దీపకలశముల నెత్తుకొని యణకువతో ఎదురురాగా ఉత్తర మధురాపతి శ్రీకృష్ణుడు తన పాదుకలను ప్రక్కవారికిచ్చి భూమి యదరునట్లు కల్యాణవేదిక వద్దకు వచ్చినట్లు నేను కలగన్నాను.

**మత్తళం గొట్ట వరిశంగం నన్నూద**
**ముత్తుడై త్తామమ్ నిరైతాళ్న్ద వందర్కీళ్**
**మైత్తునన్ నమ్బి మదుసూదన్ వన్దెన్నై**
**కైత్తలం పట్ర క్కనా క్కండేన్ తోళి నాన్.**

మృదంగములు దివ్యశంఖములు మ్రోగగా ముత్యాలహారములు తలకు తగులునట్లు వేసిన పందిరిలో నాకు మేనబావయగు శ్రీకృష్ణుడు తానే వచ్చి నా పాణిగ్రహణము చేసుకొన్నాడు.

**వాయ్ నల్లార్ నల్లమఱై యోది మందిరత్తాల్**
**పాశిలై నాణర్పడుత్తు ప్పరిదివైత్తు**
**కాయ్ శిన మాకళిఱు న్నానెన్ కైపట్రి**
**తీవలం శెయ్యక్కనా క్కండేన్ తోళి నాన్.**

ద్విజశ్రేష్ఠులు శ్లాఘ్యకంఠములతో వేదాధ్యయనము చేయుచు తగిన మంత్రములు పలుకుచు పచ్చని దర్భలను అగ్నిచుట్టును పరచారు. తర్వాత అగ్నిలో సమిధలుంచి హోమము చేయసాగారు. అప్పుడు మదగజమును పోలిన శ్రీకృష్ణుడు తన దృఢహస్తముతో నా పాణిగ్రహణము చేసి హోమ గుండమునకు ప్రదక్షిణము చేశాడు.

**ఇమ్మైక్కు మేళేళ్ పిఱవిక్కుం పత్రావాన్**
**నమ్మై యుడైయవన్ నారాయణనంబి**
**శెమ్మైయుడైయ తిరుక్కైయాల్ తాళ్ పత్రి**
**అమ్మిమిదిక్కక్క నాక్కండేన్ తోళి నాన్.**

సొగసైన వింటివంటి నొసళ్ళతో నొప్పుచు ప్రకాశించు ముఖములతో నా సోదరులందరు వచ్చి అగ్ని ముఖమున కెదురుగ సిగ్గుతో వెనుక నున్న నన్ను ముందు నిలిపారు. తర్వాత సింహపరాక్రముడును, భక్తుల నెట్టి స్థితిలోను వదలనివాడును నగు శ్రీకృష్ణుని చేయి నా చేతనుంచిరి. మా దంపతులము లాజల (బొరుగుల) నెత్తి యగ్నిలో ఆహుతిచ్చాము.

**వరిశిలైవాళ్ ముగత్తెన్నై మార్తాంపన్దిట్టు**
**ఎరిముగం పారిత్తెన్నై మున్నే నిఱుత్తి**
**అరిముగ నచ్చుదన్కైమేలే కైవైత్తు**
**పొరి మగన్దట్టుక్కనా కండేన్ తోళి నాన్.**

కుంకుమపొడి దేహమున అలది దివ్యచందనము రాచుకొని వసంత జలముతో కలయంపి జల్లిన వీథులందు ప్రదక్షిణముగ గజారూఢులమై వచ్చినాము. ఆ శ్రీకృష్ణునితో తర్వాత వసంతము లాడినట్లు నేను కల గన్నాను.

**కుంకుమ మప్పిక్కుళిర్శాన్దం మట్టిత్తు**
**మంగళ వీది వలం శెయ్దు మణధీర్**
**అందగవనోడు ముడన్శెన్దంగానై మేల్**
**మంజన మాట్టక్కనా క్కండేన్ తోళి నాన్.**

శ్రీవైష్ణవులు సదా వినుతించు పెరియాళ్వారుల పుత్రిక ఆండాళ్. యాదవకుల దీపమగు శ్రీకృష్ణునికే ధర్మపత్ని యగునట్లు తాను కన్న కలను



విశుద్ధము మృదుమధురము అగు ద్రావిడభాషలో ఆమె అనుగ్రహించింది. దీనిని సదా కంఠస్థమాలికగ దాల్చువారు విధేయులగు బిడ్డలను శిష్యులను పొందగలరు. కన్యలు పఠించినచో కృష్ణునివంటి వరుని, పురుషులు పఠించినచో విష్ణుచిత్తుల వలె భగవదనన్యార్హులగు బిడ్డలను పొందగలరు.

శ్రీవైష్ణవుల వివాహాలలో 'వారణ మాయిరం' చదవడం ఒక ఆనవాయితీ. ఇందులో వరాగమనం మొదలు ముహూర్త పత్రిక వ్రాసుకుని కల్యాణ మంటపంలోకి వరుడు ప్రవేశించడం, నిశ్చితార్థం, ప్రతిసరబంధం, పాణిగ్రహణం, అగ్ని ప్రదక్షిణం, సప్తపదులు, లాజహోమం, వసంతోత్సవం వరకుదన్న వైదిక వివాహ ప్రక్రియలన్ని ప్రస్తావించబడ్డాయి.

వారణమాయిరం తరువాత మాలాపరివర్తనం నిర్వహిస్తారు అంటే స్వామివారికి అలంకరించిన పూలదండలు అమ్మవార్లకు అమ్మవార్లకు అలంకరించిన దండలు స్వామివారికి మెడలోనూ మారుస్తూ అలంకరిస్తారు. ఇలా ముమ్మార్లు మాలా పరివర్తనం జరిగాక శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను స్వామివారికి ఇరువైపులా వేంచేయింపజేస్తారు. ఈ సమయంలో స్వామివారు మనోహరంగా ఉభయ దేవేరులతో కలిసి దర్శనమిస్తారు. అటుపైన అర్చక స్వాములు అక్షతారోపణ (తలంబ్రాలు) కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దోసిట అక్షతలను తీసుకొని స్వామివారి కుడిచేతికి తాకించి అమ్మవార్లకు, అమ్మవార్ల చేతికి తాకించి స్వామివారికి అక్షతలను సమర్పిస్తారు. ఈ కైంకర్యం నిర్వహించిన పిమ్మట అర్చకస్వామికి పరివట్టం (స్వామివారి పాదాలచెంత ఉంచిన ఒక పట్టువస్త్రాన్ని అర్చకస్వామి శిరస్సుకు చుట్టి గౌరవపూర్వకంగా శఠారిని సమర్పిస్తారు.

చివరగా ఉభయదేవేరులతో కొలువుదీరిన నిత్యకల్యాణ చక్రవర్తికి కర్పూర నీరాజనం సమర్పిస్తారు. అలాగే ఈ కైంకర్యంలో ప్రధానంగా పాల్గొన్న వారందరికీ తాంబూలం సమర్పిస్తారు.

స్వామివారికి మహానైవేద్యం సమర్పించిన పిమ్మట శిఖర హారతిని ఇస్తారు. ఆ తరువాత సేవాకర్తలకు, శఠారితోపాటుగా స్వామివారి ఆశీస్సులను అందజేస్తారు. చివరగా కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు మూలమూర్తి దర్శనానికి అనుమతిస్తారు.

**కల్యాణోత్సవము చేయించు వారికి ముఖ్య సమాచారము**

1. యాత్రికులు వారితోపాటు, రసీదుయొక్క 2 ప్రతులు, వారి గుర్తింపు కార్డుయొక్క అసలైన ప్రతి తెచ్చుకొని, అవి సహస్ర దీపాలంకార మండపం ప్రక్కనే ఉన్న 'సుపథం' వద్ద సంబంధిత అధికారులకు చూపించి, కల్యాణోత్సవ సేవ / దర్శనములలో పాల్గొనవచ్చు.
2. కల్యాణోత్సవంలో పాల్గొను దంపతులు తప్పనిసరిగా పురుషులు ధోవతి ఉత్తరీయం, స్త్రీలు చీరకట్టులోనే హాజరు కావలెను.
3. ఒకసారి సేవాటికెట్టు పొందిన తరువాత వాయిదాలు / అభివృద్ధి / రద్దు చేయడం వంటివి ఉండవు.
4. నిర్ధారించిన తేదీన సేవకు హాజరు కాకపోతే, ఎట్టి పరిస్థితులలో చెల్లించిన రుసుము తిరిగి ఇవ్వబడదు.
5. సుప్రభాతం, తోమాలసేవ, అర్చన, అష్టదళ పాదపద్మారాధన, సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ సేవలకు వి.క్యూసి.-1 వద్ద మాత్రమే ప్రవేశము కలదు మరియు కళ్యాణోత్సవము, డోలోత్సవము, ఆర్జిత బ్రహ్మోత్సవము, ఆర్జిత వసంతోత్సవము, సహస్ర దీపాలంకరణ సేవ వంటి సేవలకు సుపథము ద్వారా ప్రవేశించవచ్చును.
6. ఏ పరిస్థితుల్లోనైనా ఎటువంటి సేవలనైనా రద్దు చేయు అధికారము టిటిడికి ఉన్నది.



7. సేవాసౌకర్యము పొందుటకు ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డును (ఒరిజినల్ ఐడి ప్రూఫ్) (సేవా టిక్కెట్టు కొన్నప్పుడు ఇవ్వబడిన వసతి) జమ చేయవలెను.
8. రసీదు పేజీమీద ముద్రింపబడిన ఫోటోలోని వ్యక్తులు మాత్రమే సేవ/దర్శన కార్యాన్ని వినియోగించుకోవాల్సి ఉంటుంది.
9. మరిన్ని వివరాల కొరకు క్రింది నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

   0877-277 7777/22 3333/276 4252, 91-877-22639221.

# తాళ్లపాక కవుల శ్రీనివాస నిత్యకల్యాణ కీర్తనలు

## 1. రామక్రియ

**రేకు : అన్న, అద్యా 204**

గరుడధ్వజం బెక్కె కమలాక్షు పెండ్లికి
పరుష లదివో వచ్చెఁబైపై సేవించను

పాడిరి సోబాన నదే భారతియు గిరిజయు
ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల
కూడిరి దేవత లెల్ల గుంపులై శ్రీ వెంకటాద్రి
వేడుకలు మీరఁగ శ్రీ విభుని పెండ్లికిని

కురిసెఁ బువ్వుల వాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభి మ్రోఁత లెల్లను
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీ వేంకటాద్రి
తిరమై మించిన దేవదేవుని పెండ్లికిని

వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల
పోసి రదే తలఁబాలు పుణ్యసతులు
ఆసల శ్రీ వేంకటేశుఁడల మేలు మంగాఁదాను
సేసలు వెట్టినయట్టి సింగారపు పెండ్లికి

## 2. మంగళ కైసిక

**రేకు : 1216** **22.96**

ఆడరో పాడరో అ(ప్స) రోగణము
వీడెము లిందరో విభవము నేడు

కమలారమణుని కల్యాణమునకు
తమినదె గరుడధ్వజ మెసఁగె



తెమలుచు మ్రోసెను దివ్యదుందుభులు
గమనించరో దివిఁగల దేవతలు

వెలయఁగ లక్ష్మీవిభుని పెండ్లికిని
బలసి అంకురార్పణ మదివో
కలగొన నిచ్చేరు గంధాక్షతలవె
చెలఁగి కైకొనరో శ్రీవైష్ణవులు

బడి శ్రీ వేంకటపతికి శ్రీసతికి
అడరినతలఁబా లందె నిదె
నడచీఁ బరుషలు నానా ముఖములు
ముడుపులు చదువరొ ముయిగా నరులు

## 3. సామంతం / శంకరాభరణం

**రేకు : 234** **3.194**

పసిఁడి యక్షింతలివె పట్టరో వేగమే రారో
దెసల బేరటాండ్లు దేవుని పెండ్లికిని

శ్రీ వేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి
దైవికపుఁ బెండ్లి ముహూర్తము నేఁడు
కావించి భేరులు మ్రోసె గరుడధ్వ జంబెక్కె
దేవతలు రారో దేవుని పెండ్లికిని

కందర్ప జనకునికిఁ కమలాదేవికిఁ బెండ్లి
పందిలిలోపలఁ దలఁబ్రాలు నేఁడు
గంధమూ విడెమిచ్చేరు కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో హరిపెండ్లికిని

అదె శ్రీ వేంకటపతి కలమేలు మంగకును
మొదలి తిరునాళ్ళకు మొక్కేము నేఁడు

యెదుట నేఁగేరు వీరె యిచ్చేరు వరములివె
కదలిరారో పరుష ఘనుల పెండ్లికిని

### 4. వరాళి

**రేకు : 148** **7.280**

నెలమూఁడు శోభనాలు నీకు నతనికిఁ దగు
కలకాలమును నిచ్చకల్యాణమమ్మా

రామనామమతనిది రామవు నీవై తేను
చామన వర్ణమతఁడు చామవు నీవు
వామనుఁ డందురతని వామనయనవు నీవు
ప్రేరుపు (మీ) యిద్దరికి పేరుబలమొకటే

హరి పేరాతనికి హరిణేక్షణవు నీవు
కరిఁ గాచెఁ దాసు నీవు కరియానవు
సరిఁదా జలధిశాయి జలధికన్యవు నీవు
బెరసి మీ యిద్దరికిఁ బేరుబల మొకటే

జలజనాభుదతఁడు జలజముఖివి నీవు
అలమేలుమంగవు నిన్నలమెఁ దాను
ఇలలో శ్రీ వేంకటేశుఁడిటు నిన్నురాన మోచె
పిలిచి పేరు చెప్పెఁ బేరుబల మొకటే.

### 5. శ్రీరాగం

**రేకు : 99** **17.537**

నేఁడే పెండ్లివేళ నేఁడే నాగవల్లి
ఆడుచు సోబానఁ బాడు మనరే చెలులూ



కనకాంబరుఁ డతఁడు కనకకుచగిరి యీకె
కొనబుగల యిద్దరికిఁ గూడెఁ బొంతనము
వనజనాభుఁ డతఁడు వనజలోచన యీకె
ఘనమైన కంకణము గట్టరే చెలులు

నీలవరుఁ డతఁడు నీలకుంతలి యీకె
చాలుకొని యిద్దరికి జంట దగును
ఆలరైన శంఖధరుఁ డతఁ డీకె కంబుకంఠి
యీ లీల నారతులు యెత్తరే చెలులు

జలధిశాయిని యతఁడు జలధికన్నెక యీకె
కలిగె నిద్దరికి నొక్క కైవాడము
అలరు శ్రీ వేంకటేశుఁ డతఁ డీకె మహాలక్ష్మి
వెలయఁ గల సిరి దీవించరే చెలులు

### 6. సాళంగనాట

**రేకు : 1031** **20.182**

పేరంటాండ్లు వాడరే పెండ్లివేళ
సారెసారె నిద్దరికి సంతోషవేళ ॥పల్లవి॥

చిత్తజుతల్లికి వేగ సింగారించరె మీరు
తత్తరించే రిదె ముహూర్తపు వేళ
హత్తి తలఁబాలు నారాయణునిఁ బోయుమనరే
పొత్తుల నిద్దరికిని బువ్వపు వేళ

పాలవెల్లి కూఁతురుకు పసపులు నలఁచరే
చాలించరే జోలి వీడు చదివే వేళ

పాలుపడి పరపులు పరచరే దేవునికి
నాలుగోదినము నేఁడు నాగవెల్లి వేళ

అంది బాగాలియ్యరే అలమేలు మంగకును
కందువ శ్రీ వేంకటేశుఁ గలసేవేళ
గందమూఁ గస్తూరి నీరె ఘనరతి నలసిరి
కుందక యిద్దరు నిఁకఁ గొలువుండే వేళ

## 7. సాళంగం - 365వ సం. కీ. 14వ సం.

**రేకు : 661**

అదె శ్రీ వేంకటపతి అలమేలు మంగయును
కదిసివున్నారు తమకమునఁ బెండ్లికిని

బాసికములు గట్టరో పైపై దంపతులకు
శేసపాలందియ్యరో చేతులకును
సూసకాల పేరంటాండ్లు సోబానఁ బాడరో
మోసపోక యిట్టే ముహూర్తమడుగరో

గక్కునను మంగళాష్టకములు చదువరో
తక్కక జేఁగట (జేగఁటి) వేసి తప్పకుండాను
నిక్కి నిక్కి చూచేరదే నెరిఁ దెర దియ్యరో
వొక్కటైరి కొంగుముళ్ళు వొనరగ వేయరో

కంకణ దారములను కట్టరో యిద్దరికిని
సుంకులఁ బెండ్లిపీఁటఁ గూచుండఁ బెట్టరో
లంకె శ్రీ వేంకటేశు నలమేల్ మంగను దీవించి
అంకెలఁ బానుపు మీఁద నమరించరో



## 8. ఆహిరి

**రేకు : 28** **17.165**

లక్ష్మీకల్యాణము లీలతోఁబాడే మిదే నేము
లక్ష్మీ నారాయణులే లలనయ నీవును ॥పల్లవి॥

చూపులు చూపులు మీకు సూసకము బాసికము
పూపచన్నుగుబ్బలివి బూజగుండలు
తీపులమోవి తేనెలు తీరని మధుపర్కము
దాపుగఁ బెండ్లి యాడరయ్య తగుఁ దగు మీకును

మాటలుమీ కిద్దరికి మదనమంత్రములు
మేటితలఁ బాలు మీలో మించు నవ్వులు
గాటమైన పులకలు కప్పురవసంతాలు
నీటునఁ బెండ్లాడరయ్య నెరవేరె మీకును

కౌఁగిలి కౌఁగిలి మీకు కందువ పెండ్లి చవికె
పాఁగిన కోరికలే పావ కోళ్ళు
ఆఁగిన శ్రీ వేంకటేశ అలమేలుమంగా నీవు
వీఁగక పెండ్లాడదయ్య వేడుకాయ మీకును

## 9. శ్రీరాగం

**రేకు : 62** **5.185**

పిడికిటి తలంబ్రాల పెండ్లి కూఁతురు కొంత
పెడమరలి నవ్వీనె పెండ్లికూఁతురు

పేరుకల జవరాలె పెండ్లికూఁతురు పెద్ద
పేరుల ముత్యాల మేడ పెండ్లికూఁతురు

పేరంటాండ్ల నడిమి పెండ్లికూఁతురు విభు
పేరుకుచ్చ సిగ్గువడీ పెండ్లికూఁతురు

బిరుదు పెండెము వెట్టెఁ బెండ్లికూఁతురు నెర
బిరుదు మగని కంటె బెండ్లికూఁతురు
పిరిదూరి నప్పుడె బెండ్లికూఁతురు పతి
బెరరేఁచీ నిదివో బెండ్లికూఁతురు

పెట్టెనె పెద్ద తురుము బెండ్లికూఁతురు నేడె
పెట్టెడు చీరలు గట్టె బెండ్లికూఁతురు
గట్టిగ వేంకటపతి కౌఁగిటను వడి
వెట్టిన నిధానమైన బెండ్లికూఁతురు

### 10. నాగవరాళి

**రేకు : 517** **13.100**

సుదతులకితనికి సోబనవేళ
వుదుటునఁ జెలులెల్ల నూడిగాలు శాయరే ॥పల్లవి॥

ఇద్దరు పెండ్లి కూఁతులకితఁడు గట్టె బాసిక -
యొద్దికఁ గప్పుర వీడే లొడిఁబెట్టెను
పెద్దరికాన నడుమ బెండ్లి పీఁటపైఁ గూచుండె
వొద్దనుండి సతులెల్ల నూడిగాలు వేయరే ॥సుదతు॥

రెండు చేతుల శాసలు రెట్టించి చల్లఁదొడఁగె
దండలిద్దరి మెదలఁ దగుల వేసె
గండుమీరి ముంజేతులఁ గంకణ దారాలు గట్టె
వుండినట్టే చెలులెల్ల నూడిగాలు సేయరే ॥సుదతు॥

భూమి నలమేల్మంగను భూసతిఁ గాఁగిటఁ గూడె
దోమటి దొడికి ముందే తొక్కెఁ బాదాలు



యీమేఁటి శ్రీ వేంకటేశుఁ డిన్ని విధాల మెఱసె
వోముచును చెలులెల్ల నూడిగాలు నేయరే ॥సుదతు॥

### 11. భైరవి

**రేకు : 1093** **20.558**

నేడే నాగవెల్లి నేఁడే యిల్లునింపులు
పోఁడిమి గోవిందపతి భోగించీ నిదివో ॥పల్లవి॥

అల్లదే దేవుని రథ మల్లదే గరుడ ధ్వజ
మెల్ల లోకములు గెల్చి యేఁగీనదే
యిల్లిదే లక్ష్మీభూము లిద్దరు దేవుళ్ళు వీరే
చల్లేరు శాసలుఁ దాము సరికి బేసికిని

సేనాపతి యల్లవాఁడె చేరి దేవతలు వారే
శ్రీ నారాయణుఁడు చెలఁగీ నదే
ఆనుక యదుగడుగుకారగించీ వీధులను
వానలుగా నందరికి వరము లొసఁగుచు

దేవదుందుభులు మ్రోసె దిక్కులెల్లా జల్లనాయ
శ్రీ వేంకటేశుఁ డితఁడె చిత్తగించీని
సేవించరో భావించరో జీవులాల బ్రదుకుఁడు
వేవేలు శోభనముల వేడుక కాఁడితఁడు

### సాళంగం

**రేకు : 101** **12.4**

దేవకామిను లాడరో దివ్యదుందుభులు మ్రోసే
దేవుఁడు కోనేటి దండఁ దిరువీధి మెరసే

యెత్తిరి గరుడధ్వజ మిందిరాపతి పెండ్లికి
యిత్తల సురలు మును లిందరూ రారో
హత్తి సేనాపతి యిచ్చె నదె కప్పురవిడేలు
చిత్తగించి యాగసాల చేరె హనుమంతుడు

కట్టిరి కలువడాలు కమలాపతి పెండ్లికి
యిట్టె పేరటాండ్లు నేడ డిందరూ రారో
చుట్టి చుట్టి రక్షగాను సుదర్శనము మించి
కట్టలై తిరువాముడి ఘనులు వాడేరు

వెలయ భాష్యకారులు విందు చెప్పెc బెండ్లికి
నెలవై బువ్వాలవారు నెమ్మది రారో
అలమి శ్రీ వేంకటేశుc డల మేలు మంగc గూడె
వెలసేరు పెండ్లి చవికెలోన నదివో.

## గౌళ

రేకు : 1034 22.201

ఎట్టుగూడెc బెండ్లియోగ మిద్దరికి నీవేళ
అట్టె లక్ష్మీనారాయణ యోగము

నెలcత కమలవాసి నీవు కమలాక్షుcడవు
పొలcతికి నీకుc గూడె పొంతనాలు
వలుదచక్రవాకాలు వనితకుచాలు నీవు
యెలమిc జక్రాయుధుcడ విద్దరికిc దగును

తరుణి నీలకుంతల తగునీలవర్ణుc డవు
సరుస మీకే తగు సమ్మంధము



నిరతి హేమవర్ణాకె నీవు పీతాంబురుc డవు
సరవి నిద్దరి కొక్కజాతియ్యము

పాలవెల్లిc బుట్టె నాకె పాలవెల్లి యిల్లు నీకు
మేలు మేలు యిద్దరికి మేనవావి
యీలీల శ్రీ వేంకటేశ యింతి నీవు గూడితివి
సాలి మాకుcబెట్టరాదా సోబనవిడేలు.

## సామంతం - 110 వ. సం.కీ.సం. 14

రేకు : 619

మంచి ముహూర్తమున శ్రీమంతులిద్దరు
చంచులc బూవుదండలు చాతుకొనే రదివో ॥పల్లవి॥

సొలిదిc బేరటాండ్లు సోబానc బాడcగాను
హరియు సిరియుc బెండ్లి యాడేరదే
తొరలి యంతటా దేవదుందుభులు మొరయcగ
గరిమ బాసికములు గట్టుకొనే రదివో

మునులు మంగళాష్టకములు చదువు చుండcగ
పెనగుచు సేసలు పెట్టేరదే
ఘనులు బ్రహ్మాదులు కట్నములు చదువcగ
వొనరి పెండ్లి పీcటపై నున్నారదివో

అమరాంగన లెల్లాను ఆరతు లియ్యcగాను
కొయరార విడే లందుకొనే రదివో (రదే)
అమరి శ్రీ వేంకటేశుcడలమేలు మంగc గూడి
క్రమముతో వరములు గరుణించే రదివో

### మధ్యమావతి

**రేకు : 619** **26.246**

చూడరమ్మ సతులాల సోబానc బాడరమ్మ
కూడున్నది పతి చూడికుడ నాంచారి

శ్రీమహాలక్ష్మి యట సింగారాలకే మరుదు
కాముని తల్లియట చక్కcదనాల కేమరుదు
సోముని తోబుట్టువట సొంపుc కcళలకేమరుదు
కోమలాంగి యీ చూడికుడత నాcచారి

కలశాబ్ధి కూcతురట గంభీరాల కేమరుదు
తలcప లోకమాతయట దయ మరి ఏమరుదు
జలజ నివాసినియట చల్లcదన మేమరుదు
కొలది మీర ఈ చూడికుదులి నాంచారి

అమర వందితయట అట్టె మహిమ మేమరుదు
అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు
తమితో శ్రీ వేంకటేశు దానె వచ్చి పెండ్లాడె
కొమెర వయస్సు ఈ చూడికుడత నాచారి.

### ఆనందభైరవి

**రేకు : 873** **18.436**

పాడరే సోబనాలు పడcతులాల
వేడుక లిద్దరికిని వెలసెcజూడరే

కొండలే పీcటలుగాc గూచున్నారెదురుబడి
నండcనే నారసింహుcడు నాది లక్ష్మియు



వెండిcబైడి నిండుకొన్న వేదాద్రి గరుడాద్రుల
పెండిలాడే రిద్దరును ప్రియములc జూడరే

భవనాశి జలములc బాయక తోడనీళ్ళాడిc
రివలా నవలా దాము యేటిదరుల
జవళి మంచి పూవుల సరిసేసలు వెట్టుచు
తవిలి సుముహూర్తానc దప్పక చూచేరు

పొందుగc గనకావతి భోగావతి నదుల
సందడి వసంతముగాc జల్లులాడుచు
అందమై శ్రీ వేంకటాద్రి సహోబలాన నొక
చందమున గూడి కూడి సరసము లాడేరు

### సాళంగనాట

**రేకు : 1605** **26.40**

సిగ్గరి పెండ్లి కూcతుర సీతమ్మ
దగ్గరి సింగార బొమ్మ తలవంచకమ్మా

అల్లనాcడే రాఘవుcడు హరువిల్లు విరిచెను
యెల్లి నేcడే పెండ్లాడీ నిదివో నిన్ను
యెల్లగా జనకుcడు నిన్నిచ్చీనట వీcడె
వెల్లివిరి నీమాట వినవమ్మా

అదె పెండ్లితెర యెత్తి రండనే వసిష్ఠుc డుండి
చదివీ మంత్రాలు సేస చల్లవమ్మా
మొదల రామునికంటె ముంచి తలcబాలు వోసి
సుదతి యాతని మోము చూడవమ్మా

కంకణదారాలు గట్టి కాలుదొక్కితిమి మీరు
పొంకాన బువ్వ మందరో పొత్తుల నమ్మ

మంకువ వావిలిపాట నుండి శ్రీ వేంకటగిరి
తెంకుల నిన్నుఁ గూడి తిరమాయనమ్మా

**వసంతం/రీతిగౌళ**

**రేకు : 4** **5.18**

శోభనమే శోభనమే
వైభవముల పావన మూర్తికి

అరుదుగ మును నరకాసురుఁడు
సిరులతోఁ జెరలు దెచ్చిన సతుల
పరువపు వయసుల బదారు వేలను
సొరిదిఁ బెండ్లాడిన సుముఖునికి

చెందిన వేడుక శిశుపాలుఁడు
అంది పెండ్లాడఁగ నవగళించి
విందు వలెనె తావిచ్చేసి రుకుమిణి
సందడిఁ బెండ్లాడిన సరసునికి

దేవదానవులు ధీరతను
దావతిపడి వార్ధి దరువఁగను
శ్రీవనితామణిఁ జెలగి పెండ్లాడిన
శ్రీ వేంకటగిరి శ్రీనిధికి

**బౌళి**

**రేకు : 62** **5.186**

పెట్టని కోటిందరికిఁ బెండ్లి కొడుకు బొమ్మఁ
బెట్టె నసురల కెల్లఁ బెండ్లికొడుకు



పెల్లగించి భూమెత్తీఁ బెండ్లికొడుకు వాడె
పిల్లఁగోవి రాగాల పెండ్లికొడుకు
పిల్లైన యీవూల పెండ్లికొడుకు వాఁడె
పిల్లఁ దీపు పెన్నుద్ది పెండ్లికొడుకు

పెంచెపు శిరసుపాగ పెండ్లికొడుకు గుం -
పించిన కోపగించీఁ బెండ్లికొడుకు
పెంచకప్పుడే పెరిగెఁ బెండ్లికొడుకు వల
పించెఁ జక్కని సిరిఁ బెండ్లికొడుకు

పెంట పెరుగుల దొంగ పెండ్లికొడుకు భూమిఁ
బెంటిపోతులఁ గూరిచెఁ బెండ్లికొడుకు
గెంటులేని వేంకటగిరి మీఁదను వాఁడె
పెంట వెట్టు కున్నవాఁడు పెండ్లికొడుకు

**శంకరాభరణం**

**రేకు : 903** **19.18**

అలివేణినిఁ బెండ్లాడవయా
చెలులవిన్నపము చేకొనవయ్యా

సొలపులఁ దొలితొలి చూచిన చూపులు
కొలదిఁ మీర నుంకువ లాయ
చెలఁగి చేతులను సేసిన సన్నలు
తలడుఁగ నలుగడఁ దలఁబాలాయ

ననుపున సెలవుల నవ్విన నవ్వులు
గొనకొనఁగఁ బాలకూళ్ళాయ

అనువుగ ప్రియమున నాడిన మాటలు
మనసి జతంత్రపు మంత్రము లాయ

వేడుక కాఁ గిటి వినయపు సేంతలు
కూడిన కూటపు గురులాయ
యీడనె శ్రీ వేంకటేశ యేలితివి
తోడలమేల్మంగ దోమట్లాయ

**కాంబోజి**

**రేకు : 272** **9.129**

ఇంత చాలదా మాకు నిదినేఁడు
కంతుని వోజల పెండ్లి గలిగెఁగా నేఁడు

కాంతకును నీకును కనురెప్పలె తెర
దంతపు నవ్వులె మీకు తలఁబాలు
రంతుల పూరువులె రవళి సోబనాలు
చెంతల మీకీ పెండ్లి చెల్లెఁగా నేఁడు

ముదితకు నీకును మోవులె బువ్వములు
కదియు సిగ్గులె మంచి కమ్మగందాలు
సదరపు సరసాలె చట్ల వెద వీడేలు
యెదురెదురనె పెండ్లి యెసగెఁగా నేఁడు

వుంచపు గోరితాఁకులె వుంకువ సొమ్ములు
ముంచిన పలు సోఁకులె ముయికిముయి
యెంచఁగ శ్రీ వేంకటేశ యిందిర నీ కూటయులు
కంచపుఁ బెండ్లి మీకుఁ గలిగెంగా నేఁడు



**ఆహిరి**

**రేకు : 4** **17.443**

ధారుణీపతికినిఁ దలఁబాలో బహు
దారారతునకుఁ దలఁ బాలో ॥పల్లవి॥

హేమవర్ణునకు నిందిరాపతికి
దామోదరునకుఁ దలఁ బాలో
సామజభయరక్షకునకు దులసీ
ధామునకు హరికిఁ దలఁబాలో

కలికిరుకిమిణికిఁ గడుఁ దమకించి
తలదైవమునకుఁ దలఁబాలో
మలసి సత్యభామకుఁ బతిపంకజ
దళనేత్రునకునుఁ దలఁబాలో

తిరువేంకటమున దినపెండ్లిగల
తరుణులపతికినిఁ దలఁబాలో
యిరువుగ బాయక యిందిర నురమున
ధరియించువారికిఁ దలఁబాలో

**దేశా**

**రేకు : 4**

పురుషులలోనెల్లా పురుషోత్తముడు వాడె
తిరుతేరు మీద నేగీ దేవదేవోత్తములు

చెక్కులు ఎరవగాను సేసముత్యాలు రాలగా
యెక్కువైన తేరుమీద నేగీవాడె

యిక్కువలు కరగుచు యిరుమేల నొరగుచు
చిక్కని నవ్వులు నవ్వీ చెలులతో వాడె

నిమ్మపంట వేసుకొంటా నిక్కినిక్కి చూచుకొంటా
యెమ్మెలకు తెరిమీద నేగీవాడె
తమ్ములను సారె చేసి తగ వల్లెవాటు వేసి
చెమ్మచెమట గందాల చెలరేగీవాడె

అలయుచు సొలయుచు నలమేలుమంగకూడి
యెలమి తిరుతేరుపై నేగీవాడె
బలమి శ్రీ వేంకటాద్రిపతి యీ పెండ్లికొడుకు
నిలువు చక్కదనాన నిండుకొనీ వాడె

**లలిత / మధ్యమావతి**

**రేకు : 1032** **20.189**

చిత్తజగరుఁడ నీకు శ్రీమంగళం నా -
చిత్తములో హరి నీకు శ్రీమంగళం

బంగారు బొమ్మవంటి పడఁతి
సింగారించిన నీకు శ్రీమంగళం
రంగుమీరఁ బీతాంబరము మొలఁగట్టుకొని
చెంగలించే హరి నీకు శ్రీమంగళం

వింతనీలముల వంటి వెలఁది నీపాదముల -
చెంతఁ బుట్టించిన నీకు శ్రీమంగళం
కాంతుల కౌస్తుభమణిఁ గట్టుక భక్తుల కెల్లాఁ
జింతామణివైన నీకు శ్రీమంగళం



అరిదిపచ్చలవంటి యంగన శిరసు మీఁద
సిరులఁ దాల్చిన నీకు శ్రీమంగళం
గరిమ శ్రీ వేంకటేశ ఘనసంపదల తోడి
సిరివర నీకు నిదె శ్రీమంగళం.

* * *

## ఉపయుక్త గ్రంథాలు


1. శ్రీ వేంకటేశ్వరస్వామి కైంకర్యాలు - శ్రీమాన్ అర్చకం రామకృష్ణ దీక్షితులు
2. తాళ్ళపాక పదకవుల సంకీర్తనల్లో కల్యాణాలు - ఆచార్య కె.సర్వోత్తమ రావు
3. హరికొలువు - శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
4. నిత్యానుసంధానం - దర్శనసార్వభౌమ శ్రీ సుదర్శనాచార్య స్వామి
5. శ్రీనివాస వైభవం - శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
6. తాళ్ళపాక పదకవులు - కల్యాణ సంకీర్తనలు - డా॥ మేడసాని మోహన్
7. తిరుమలవాసుని కల్యాణోత్సవము - ఆచార్య కె.సర్వోత్తమ రావు

తిరుమల శ్రీవారి నిత్య కల్యాణోత్సవం

